జగనన్న కాలనీలో అక్రమాలపై విచారణ

సంబేపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండలం వడ్లపల్లి రోడ్డు మార్గంలో మోటకట్ల జగనన్న కాలనీలో అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని తహసీల్దార్ వెంకటేశులు తెలిపారు. ఆంధ్రజ్యోతిలో 'జగనన్న కాలనీ అమ్మేశారు' అన్న కథనంతో వెలువడటంతో తహసీల్దార్ శనివారం కాలనీని పరిశీలించారు. ఇంకా గృహాలు పూర్తికాకుండా వివిధ దశల్లో నిలిచిపోయిన నిర్మాణాలపై ఆరాతీశారు. గతంలో జేసీ విచారణ కూడా పరిగణలోకి తీసుకుని పలు కోణాల్లో ఆక్రమణలపై పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

గుంతలన్నీ పూడ్చేస్తాం

- అర్హులందరికీ కొత్త పింఛన్లు
- రాయచోటి-కడప సొరంగ మార్గానికి రూ.1100 కోట్లు
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



నరసారెడ్డిగారిపల్లె రోడ్డులో గుంతలు పూడ్చే పనులను ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి, కలెక్టర్ శ్రీధర్

సంబేపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రూ.3.5 కోట్లతో రోడ్లతో గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్‌లు శనివారం ప్రారంభించారు. రాయచోటి నియోజకవర్గంలో మిషన్ పాట్ హోల్ ఫ్రీ కింద రూ.1.27 కోట్లతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సంబేపల్లె నుంచి నరసారెడ్డిగారిపల్లె వరకు రోడ్డు పనులకు పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో రోడ్లు గుంతలు పడి అధ్వాన్నంగా మారాయని, ఒక గుంత కానీ పూడ్చలేదని తెలిపారు. అప్పట్లో రోడ్లపై వరినాట్లు వేసిన విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పంతో రోడ్లన్నీ గుంతలు పూడ్చి ప్రజలకు సౌకర్యంగా కల్పించే మంచి ప్రభుత్వం మనదన్నారు. రాయచోటి-కడప సొరంగ మార్గం పనులకు రూ.1100 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. వీటితో పాటు రాయచోటి-వీలేరు నాలుగు లేన్ల మార్గం కూడా ఏర్పాట్లకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ తాగునీటి కోసం ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని, శాశ్వత తాగునీటి పరిష్కారానికి ముఖ్యమంత్రితో మాట్లాడి వెలిగల్లు, శ్రీనివాపురం రిజర్వాయర్, ఝరికోన ప్రాజెక్టుల ద్వారా తాగునీరు కల్పించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అర్హులైన వారందరికీ పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇళ్లు లేని వారికి జనవరి నుంచి స్థలాలను కేటాయించి గృహానికి నాలుగు లక్షల రూపాయలు ఇస్తామని తెలిపారు. ప్రతి గ్రామానికి ఒక శ్మశాన వాటిక ఏర్పాటు కోసం రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూములను కేటాయించే విధంగా చూస్తామన్నారు. తాగునీటి కోసం ఇప్పటికే రాయచోటి నియోజకవర్గంలో మూడు కోట్ల రూపాయలు ఖర్చు చేసి 130 బోర్లు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ సహదేవరెడ్డి, మంత్రి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మల్లు నరసారెడ్డి, ఎంపీడీవో రామచంద్ర, తహసీల్దార్ వెంకటేశులు, రంగారెడ్డి, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌నాయుడు, శశిధర్‌రెడ్డి, ఎంపీటీసీ రామరాజు టీడీపీ నాయకులు మల్లు విష్ణువర్ధన్‌రెడ్డి, వేణుగోపాల్‌నాయుడు, సుబ్బరాజుయాదవ్, ఖాదర్‌బాషా, సంజీవ, కాటమరాజు, భాస్కర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాత సామాన్లు అమ్ముతాం



- ధరలు మాత్రం తగ్గించం
- ఎక్సైజ్ శాఖ వింత నిర్ణయం

6

ఆరు దశాబ్దాల ఆకాశవాణి

'ఆకాశవాణి.. కడప కేంద్రం నుంచి ప్రసారాలు..' అనే మాటలు ఆరు దశాబ్దాలకు పైగా జిల్లా ప్రజలకు చిరపరిచితం. కడపలో రేడియో (ఆకాశవాణి) కేంద్రం ఏర్పడి 61 సంవత్సరాలు అయింది. ఉమ్మడి రాష్ట్రంలోనే కడప కేంద్రం రేడియో ప్రసారాల్లో తన మార్క్‌ను చాటుకుంది. కర్ణాటక ప్రసారాలు కూడా ఇక్కడి నుంచే ఉండేవి. సోషల్ మీడియా పెరిగింది. ప్రసార మాధ్యమాలు ఎక్కువయ్యాయి. అయినా రేడియోకు ఉండే ఆదరణ అలానే ఉంది. ఇప్పటికీ అభిరుచి లేఖలు పంపడం, రేడియోలో నచ్చిన పాటలకోసం ఫోన్లు చేయడం ఏమాత్రం తగ్గలేదు. ఆరుదశాబ్దాల కడప ఆకాశవాణి కేంద్రం గురించి ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.



రేడియో స్టేషన్‌లో రికార్డ్ చేస్తున్న దృశ్యం

- ప్రసారాల్లో తన మార్కు చాటుతున్న కడప రేడియో కేంద్రం
- ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు
- అన్నివర్గాల కోసం ప్రత్యేక కార్యక్రమాలు
- ఇప్పుడు ఎఫ్‌ఎంలో కూడా ప్రసారాలు

(కడప-ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాల క్రితం ప్రధానమైన ప్రసార మాధ్యమం రేడియోనే. అప్పట్లో రేడియో అంటే ఓ స్టేటస్. ఆ ఇంట్లో రేడియో ఉందని గొప్పగా చెప్పుకునే రోజులవి. దేశంలో ఏ మూలన ఏ ఘటన జరిగినా అప్పట్లో రేడియోలు, పత్రికలే ఆధారంగా తెలుసుకునేవారు. తరువాత టీవీ చానెల్స్ రాకతో కొద్దిరోజులు వాటి మనుగడ ప్రశ్నార్థకంగా అనిపించేది. ఆ తరువాత ఎఫ్‌ఎంలు పుట్టుకొచ్చాయి. కొన్నిచోట్ల రేడియో స్టేషన్లు మూతబడ్డాయి కూడా. అయితే ఎన్ని ప్రసార మాధ్యమాలు వచ్చినా.. రేడియోకున్న క్రేజ్ తగ్గడంలేదు. ఇప్పుడు సమాచార శాఖ కూడా టెక్నాలజీని ఒడిసి పట్టుకుంది. న్యూస్ ఆన్ ఎయిర్ యాప్ ద్వారా మొబైల్‌లోకి వచ్చేసింది. దీంతో మొబైల్‌లో రేడియో కార్యక్రమాలు వింటున్నారు. మళ్లీ రేడియో ప్రసారాలకు ఆదరణ పెరుగుతోంది.

61 ఏళ్ల కిందట మొదలు

కడప ప్రాంతీయ రేడియో కేంద్రాన్ని 1963 జూన్ 17న ప్రారంభించారు. సాయంత్రం 5 నుంచి రేడియో ప్రసారాలు ప్రారంభం అయ్యేవి. 1975 జూన్ 1న నుంచి మూడుపూటలా ప్రసారాలు వచ్చేవి. 1983 అక్టోబరు 10న సామర్థ్యం పెంచారు. దీంతో కడప, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు జిల్లాలకు ఇక్కడ నుంచి ప్రసారాలు అందేవి. అప్పటికే విజయవాడ, విశాఖపట్టణం, హైదరాబాదులో రేడియో స్టేషన్లు ఉండేవి. పేరుకు కడప ప్రాంతీయ కేంద్రం అయినప్పటికీ.. అటు వైజాగ్ వరకు ఇటు మహబూబ్‌నగర్, తెలంగాణవరకు మరోవైపు కర్ణాటక వరకు ప్రసారాలు అందేవి. కడప రేడియో కేంద్రం నుంచి అన్నివర్గాలను ఆకట్టుకునేలా ప్రసారాలు ఉండేవి. రైతుల కోసం పాడిపంటల పేరిట వ్యవసాయంలో శాస్త్రవేత్తల సూచనలు సలహాలు ఇచ్చేవారు. ఇక పంట పొలాల్లో వచ్చే తెగుళ్ల నివారణకు సూచనలు అందించేవారు. సంగీతం, జానపద, సాహిత్యం, బుర్రకథలు, శాస్త్రీయ సంగీతం, నాటికలు...

- తరువాయి 6లో..

కడప కేంద్రం ద్వారా జనరంజక ప్రసారాలు



కడప ఆకాశవాణి కేంద్రం ద్వారా జనరంజక ప్రజోపయోగ కార్యక్రమాలు ప్రసారం చేస్తున్నాం. శ్రోతలు మెచ్చేలా వినూత్న కార్యక్రమాలు తెచ్చాం. జిల్లాలోని కళాకారులు, కవులను ప్రోత్సహించేందుకు మంచి కార్యక్రమాలు చేపడుతున్నాం. కరెంట్ అఫైర్స్, మహిళభారతి, సూక్తిరత్నావళి, డాక్టర్ల సలహాలు ప్రసారం చేస్తున్నాం. కడప కేంద్రం ప్రసారాలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుంది.

- మహేశ్ తుండూరి, ప్రోగ్రాం డైరెక్టర్, కడప ఆకాశవాణి కేంద్రం



శ్రోతల ఉత్తరాలను చదువుతున్న అనౌన్సర్ రవికుమార్‌రెడ్డి

ఎకరం తడిపే ప్రాజెక్టు లేదు..



పూడిపోయిన వెలిగల్లు కాలువ

- సాగునీళ్లిచ్చి ఆదుకోండి..
- కరువు కోరల్లో జిల్లా
- రాష్ట్రంలో 54 కరువు మండలాలు.. జిల్లాలోనే 19
- అన్నమయ్య ప్రాజెక్టుకు మోక్షమెప్పుడు?
- వెలిగల్లు, ఝరికోన కాలువలకు దిక్కులేదు
- పింఛా నీళ్లు వృథాగా ఏటిపాలు
- నేడు జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జిల్లాలో పేరుకు ఒకటో, రెండో సాగునీటి ప్రాజెక్టులు ఉన్నాయి.. వాటికీ కాలువలు లేవు. ఎన్నో ఏళ్లుగా ఉన్న అన్నమయ్య, పింఛా ప్రాజెక్టులు వైసీపీ ప్రభుత్వ హయాంలో వరదలకు కొట్టుకుపోయాయి. ఇప్పటికీ ఆ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి కాలేదు. వెలిగల్లు ప్రాజెక్టు కాలువలకు పలుచోట్ల గండ్లు పడ్డాయి. లైనింగ్ లేదు. దీంతో వాటివల్ల రైతులకు ఎటువంటి ఉపయోగం లేదు. ఝరికోన ఎప్పుడో దశాబ్దం కిందట పూర్తయినా ఇప్పటికీ కాలువలు సర్వే దశలోనే ఉన్నాయి. ఫలితంగా జిల్లాలో కనీసం ఎకరా ఆయకట్టుకు నీళ్లిచ్చే ప్రాజెక్టులు ఒకటీ లేవు. అదే సమయంలో ఈ ఏడాది జిల్లాలో అనుకున్నంత వానలు పడకపోవడంతో చెరువులు, కుంటల్లో నీళ్లు లేవు. బావులు ఎండిపోయాయి. బోర్లు అడుగంటిపోయాయి. ఈ పరిస్థితుల్లో వ్యవసాయమే ముఖ్య ఆధారమైన జిల్లా తీవ్ర కరువు కోరల్లో చిక్కుకుంది. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 54 కరువు మండలాలను ప్రకటిస్తే అందులో అన్నమయ్య జిల్లాలో 19 ఉండడం గమనార్హం. ఈ సంఖ్యను బట్టే జిల్లా రైతాంగాన్ని కరువు భూతం ఏ మేరకు కబళించిందో అర్థం చేసుకోవచ్చు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం నేడు (ఆదివారం) జరగనుంది. ఈ సమావేశానికి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డితో పాటు జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, హాజరవుతున్నారు.

అన్నమయ్యకు మోక్షమెప్పుడు ?

అన్నమయ్య ప్రాజెక్టు 2021 నవంబరులో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వరదల్లో కొట్టుకుపోయింది. పదుల సంఖ్యలో ప్రజలు మృత్యువాతపడ్డారు. వేల సంఖ్యలో పశు సంపద నీటమునిగింది. వందల కోట్ల రూపాయల విలువైన ఆస్తిపాస్తులను ప్రజలు కోల్పోయారు. ప్రాజెక్టు కొట్టుకుపోయి మూడు సంవత్సరాలు పూర్తవుతున్నా.. ఈ ప్రాజెక్టు పునర్ నిర్మాణం కోసం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పైసా ఖర్చు చేయలేదు. రూ.700 కోట్లతో ప్రాజెక్టు నిర్మిస్తామని, టెండర్లు పూర్తయ్యాయని ఎన్నికలకు ముందు కల్లబొల్లి మాటలతో కబుర్లు చెప్పింది. నష్టపోయిన ప్రజలకు కనీసం ఇళ్లు కూడా నిర్మించలేదు. బాధితులను అన్ని విధాలా ఆదుకోనూ లేదు. ఇప్పుడు ప్రభుత్వం మారిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ఈ ప్రభుత్వంలో నైనా అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత రైతులు కోరుతున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాజంపేట నియోజకవర్గంలో పలు మండలాలకు సాగునీటితో పాటు తాగునీరు అందుతుంది. చెరువులకు నీళ్లు అందుతాయి. అధికారులు ఈ అంశానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి చర్చించాలని పలువురు కోరుతున్నారు.



కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు

పింఛా నీళ్లు ఏటిపాలు

2021 నవంబరులోనే అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయిన రోజే పింఛా ప్రాజెక్టు కూడా కొట్టుకుపోయింది. ప్రస్తుతానికి ఈ ప్రాజెక్టు పునర్ నిర్మాణం పూర్తయింది. అయితే ఇప్పటికీ ఇంకా గేట్లు ఏర్పాటు పూర్తి కాలేదు. ఫలితంగా ఇటీవల పెద్ద మొత్తంలో నీటిని పింఛా ప్రాజెక్టు నుంచి నదిలోకి వృథాగా వదిలారు. ఈ ప్రాజెక్టులో నీళ్లు ఉంటే సుండుపల్లె మండలంలో ముడుంపాడు, మాచిరెడ్డిగారిపల్లె, రాయవరం, పెద్దినేనికాలువ గ్రామాలకు సాగునీరు అందుతుంది. ఈ ప్రాజెక్టు కాలువలకు నీళ్లు వదిలితే సుమారు 12 చెరువులు నీటితో కళకళలాడుతాయి. ఈ ప్రాజెక్టు ద్వారా పలు గిరిజన తాండాలకు సాగునీరు అందుతుంది. అయితే మూడు సంవత్సరాలుగా పింఛా ప్రాజెక్టు వల్ల ఈ ప్రాంత రైతులకు ఎటువంటి ఉపయోగం కలగలేదు. సత్వరమే ఈ ప్రాజెక్టుకు గేట్లను ఏర్పాటు చేసి నీటిని నిల్వ చేసే విధంగా సమావేశంలో చర్చించాల్సిన అవసరం ఉంది.

కాలువల కంటే జల్లెడ నయం

గాలివీడు మండలంలో ఉన్న వెలిగల్లు ప్రాజెక్టు కుడికాలువ సుమారు 52 కిలోమీటర్లు ఉంది. దీని కింద 23,400 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టు పూర్తయి 16 సంవత్సరాలు అవుతున్నా ఇప్పటి వరకు ఒకసారి కూడా చివరి ఆయకట్టుకు నీళ్లు అందలేదు. ఈ కాలువకు పలుచోట్ల గండ్లు పడ్డాయి. గత ప్రభుత్వం నిధుల కేటాయింపులో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయకుండానే మధ్యలో వదిలి వెళ్లిపోయారు. 52 కిలోమీటర్ల కాలువకు గానూ 15 కిలోమీటర్లు మాత్రమే లైనింగ్ వేశారు. దీంతో చివరి ఆయకట్టుకు కనీసం 25 శాతం కూడా నీళ్లు అందడం లేదు. అదేవిధంగా పిల్ల కాలువలకు మరమ్మతులు చేయలేదు. ఫలితంగా వెలిగల్లు ప్రాజెక్టు ఉన్నా ఉపయోగం అంతంతే అన్నట్లుగా ఉంది.

సర్వే దశలోనే ఝరికోన కాలువలు

ఎప్పుడో పదిహేను సంవత్సరాలకు పూర్వం పూర్తయిన ఝరికోన ప్రాజెక్టుకు ఇంకా కాలువలు సర్వే దశలోనే ఉన్నాయి. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణం తర్వాత ముఖ్యమంత్రిగా రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డి, చంద్రబాబునాయుడు, జగన్‌మోహన్‌రెడ్డిలు పని చేశారు. అయినా ఇప్పటికీ ఈ ప్రాజెక్టు కాలువలకు మోక్షం కలగలేదు. ఈ ప్రాజెక్టుకు కాలువలు పూర్తయితే సుండుపల్లె, సంబేపల్లె, కేవీ పల్లె మండలాల రైతాంగానికి ఉపయోగం కలుగుతుంది. సంబేపల్లె మండలంలో సరైన సాగునీటి వసతి లేని గ్రామాలకు ఈ ప్రాజెక్టు నుంచి నీళ్లు అందించవచ్చు.

ఉపయోగం లేని రిజర్వాయర్

చిన్నమండెం మండలంలో నిర్మించిన శ్రీనివాసపురం రిజర్వాయర్ (మండిపల్లె నాగిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) వల్ల రైతులకు ఎటువంటి ఉపయోగం ఉండడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రిజర్వాయర్ పూర్తయినా ఇప్పటికీ పూర్తి స్థాయిలో కాలువల నిర్మాణం జరగలేదు. దీంతో ఈ రిజర్వాయర్ నుంచి కాలువలకు నీళ్లు వదిలే అవకాశం లేదు. ఫలితంగా ఈ రిజర్వాయర్ వల్ల ప్రస్తుతానికి ఎటువంటి ఉపయోగం లేదని రైతులు వాపోతున్నారు. ఈ రిజర్వాయర్ కాలువల నిర్మాణం జరిగితే సంబేపల్లె, రాయచోటి మండలాలకు సాగునీరు అందుతుంది.

గత ప్రభుత్వం సాగునీటి రంగంపై పూర్తి నిర్లక్ష్యం

ఐదు సంవత్సరాల జగన్ ప్రభుత్వం సాగునీటి రంగంపై పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శించింది. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయలేదు. కొట్టుకుపోయిన వాటిని పునర్ నిర్మించే పనులు చేపట్టలేదు. పూర్తయిన ప్రాజెక్టులకు కాలువలు నిర్మించలేదు. దెబ్బతిన్న వాటికి మరమ్మతులు చేసేందుకు నిధులు కేటాయించలేదు. దీంతో అప్పటి ప్రభుత్వ హయాంలో కొత్తగా కనీసం ఎకరాకు నీళ్లు ఇచ్చే పనులు కూడా చేపట్టలేదని రైతులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ పాపం జిల్లా రైతాంగం పాలిట శాపంగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం కరువు కోరల్లో చిక్కి శల్యమైన రైతాంగాన్ని ఆదుకునేందుకు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఆకాశవాణి.. కడప కేంద్రం!

● ఆరు దశాబ్దాలుగా ప్రసారాల్లో తన మార్కు ● ఉమ్మడి రాష్ట్రంలోనే కడపకు ప్రత్యేక గుర్తింపు
● అన్నివర్గాల కోసం ప్రత్యేక కార్యక్రమాలు ● ఇప్పుడు ఎఫ్ఎంలో కూడా ప్రసారాలు


ఆరు దశాబ్దాలుగా రికార్డయిన వాటి సీడీలు


కడప ఆకాశవాణి కేంద్రంలో ఉన్న సంగీత పరికరాలు



5వ పేజీ తరువాయి

ఇలా ఒకటేంటి బోలెడు ప్రసారాలు అందించేవారు. జిల్లాలో అప్పట్లో జానపదానికి, ఇతర కళాకారులకు కొదవ లేదు. సాహిత్యం, సురభి నాటకాలు ప్రసిద్ధి చెందాయి. కడప కేంద్రం నుంచి పుట్టపర్తి నారాయణాచార్యులు, పినాకపాణి, ఎంఎల్ వసంతకుమార్, పులికంటి క్రిష్ణారెడ్డి, మధురాంతకం రాజారాం, కలువకొలను సదానంద, కేతు విశ్వనాథరెడ్డి, ఆరవేటి శ్రీనివాసులు, సొదుం జయరాం లాంటి ప్రముఖుల ప్రసారాలు ఇచ్చాయి. దివంగత సినీనటుడు గొల్లపూడి మారుతీరావు కడప రేడియో స్టేషన్‌లో పనిచేశారు. మంచి మంచి కార్యక్రమాలు ప్రసారం చేసి కడప స్టేషన్ విశేషంగా ఆకట్టుకుంది. ఇక చిత్రలహరి, చిత్రమంజరి పాటలు వచ్చేవి. ఉదయాన్నే సిగ్నేచర్ ట్యూన్‌తో ప్రారంభమై 5.50గంటలకు ప్రసారాలు మొదలయ్యేవి. సూక్తిరత్నావళి వచ్చేవి. అప్పట్లో ప్రతి ఇంట్లో రేడియో ఉండడంతో సుప్రభాతాలు, విశేషాలు వింటూ మహిళలు ఇంట్లో పనులు చేసుకుంటుండేవారు.

అదే క్రేజీతో ఇప్పుడూ ప్రసారాలు

చాలాకాలంగా దూరదర్శన్ ఉన్నప్పటికీ ఈటీవీ రాకతో ఎంటర్‌టైన్‌మెంట్‌లో మార్పులు వచ్చాయి. అప్పటి దాకా రేడియో ద్వారా వార్తలు, పొలం కబుర్లు, నాటికలు, సినిమా పాటలు, క్రికెట్ కామెంట్లు ఇతర ప్రసారాలు విన్న శ్రోతలు టీవీల రాకతో దానికి కనెక్ట్ అయ్యారు. ఆ తరువాత ఎలక్ట్రానిక్ మీడియా రావడంతో రోజువారి వార్తలు బ్రేకింగ్ పేరిట వచ్చేవి. అయితే ఎన్ని ఉన్నా కూడా రేడియోలో వార్తలు వచ్చాయంటే అది అధికారికంగా కన్‌ఫర్మ్ అయినట్లు. తరవాత కొద్దిరోజులు ఎఫ్ఎం రేడియో వచ్చింది. జాకీల పేరుతో రకరకాల యాంకరింగ్‌తో ఎఫ్ఎంకు కొద్దిరోజులు ఆదరణ పెరిగింది. అవి జనాల్లో ఉన్నాయి. అయితే ఎన్ని వచ్చినా రేడియో రేడియోనే అన్నట్లు దాని క్రేజ్ తగ్గడంలేదు. రేడియోలు నేరుగా కొనకపోయినా కార్లలో రేడియో ఎఫ్ఎంలు, మొబైల్‌లో ఎఫ్ఎంలు, న్యూస్ ఆన్ ఎయిర్ యాప్ మొబైల్‌లో ఉండడంతో ఇక ఈ ప్రసారాలన్నీ యధావిధిగా అందుతున్నాయి. కడప కేంద్రం నుంచి రేడియోతో పాటు ఎఫ్ఎం ద్వారా కూడా ప్రసారం చేస్తున్నారు. ఫోనులైన్ ద్వారా కోరుకున్న పాటలు శ్రోతలకు అందిస్తున్నారు. రేడియో ప్రసారాలు ఇప్పటికీ ఎంతలా ఆదరణ పొందుతున్నాయంటే కడప రేడియో స్టేషన్‌కు ఇప్పటికీ శ్రోతల నుంచి ఇన్‌లాండ్ కవర్లు, పోస్టు కార్డులు పెద్ద సంఖ్యలో రావడం గమనార్హం. ఉత్తరాల్లో శ్రోతలు రాస్తున్న వివరాలను సలహాలు సూచనలు చదివి వినిపిస్తున్నారు.

ప్రసారాలకు డిమాండ్

ఇన్ని మాధ్యమాలు ఉన్నా రేడియోకు క్రేజ్ తగ్గడం లేదు. ఎలాగంటే రేడియో ప్రోగ్రాం కోసం భారీ ఎత్తున ప్రకటనలు రావడం గమనార్హం. కాంతిరేఖలు పేరిట డాక్టర్ల సలహాలు ఇస్తుంటారు. దానికి పెద్దఎత్తున శ్రోతల నుంచి రెస్పాన్స్ వస్తుంది. అర్ధగంట ప్రోగ్రాంకు ఆ సమయంలో వచ్చే అన్ని ఫోన్లకు క్యారీ చేసి సమాధానం చెప్పలేపోతున్నారు. అందుకే ఈ ప్రోగ్రాం కోసం డాక్టర్లు క్యూలో ఉంటుంటారు.

అరుదైన సంపద

కడప రేడియో కేంద్రంలో సంగీతం, సాహిత్యానికి సంబంధించి అరుదైన సంపద ఉంది. ఆరు దశాబ్దాల నాటి సంగీత పరికరాలు, క్యాసెట్లు, సీడీలు ఉన్నాయి. వీటన్నింటికంటే ముఖ్యమైనది.. ప్రముఖుల స్వరం. రేడియో ద్వారా నాలుగైదు దశాబ్దాల ద్వారా కథో, కవితో వినిపించిన నాటి ప్రముఖుల ఆడియోలు ఇప్పటికీ ఇక్కడ భద్రంగా ఉన్నాయి. అప్పుడప్పుడు వారి కథలను పునర్ ప్రసారం చేస్తూ జిల్లా ప్రజలను ఆకాశవాణి అలరిస్తోంది.


విద్యార్థులతో యువవాణి నిర్వహిస్తున్న స్టేషన్ డైరెక్టర్

ప్రసారాలు ఇలా..

రోజూ ఉదయం 5.50కి సిగ్నేచర్ ట్యూన్ మొదలవుతుంది. 5.50కి మంగళధ్వని, దేశభక్తిగీతం, ఆ రోజు ప్రాముఖ్యత బట్టి వివరిస్తారు. 6.05కు న్యూస్, 6.10కి భక్తి రంజని, శుక్రవారం ముస్లింల కోసం ప్రసారం ఉంటుంది. 6.30కి సూక్తిరత్నావళి, 6.35కు పొలం కబుర్లు, 6.45కు ప్రాంతీయ వార్తలు, 7గంటలకు ఆ రోజు ప్రోగ్రాం వివరాలు, 7.05కు జాతీయ వార్తలు హైదరబాదు నుంచి రిలే, 7.15కు కాంతిరేఖల్లో రాయలసీమ సాహిత్యం, సలహాలు, సైన్స్ టెక్నాలజీ, ఇంటెలిజెన్స్ ఆర్టిఫిషియల్, చరిత్రలో ఈరోజు కూరగాయల ధరలు, శుక్రవారం గాంధిగారి ఆత్మకథ ఉంటాయి. 8.30కు సమాచార భారతి, 8.35కు చిత్ర మంజరి, 9 నుంచి 10గంటల వరకు వాట్సప్ ద్వారా మనోరంజని పాటలు, 10 నుంచి హలో అభిరుచి ఫోన్‌లైవ్ పాటలు ఉంటాయి. 11గంలకు శాస్త్రీయ సంగీతం, 12.05 నుంచి 12.30 వరకు కర్ణాటక సంగీతం, 1.10 నుంచి 1.20 వరకు పసిడి పంటలు, తెగుళ్లనివారణ సస్యరక్షణకు ఎరువులు, 1.20కి ప్రాంతీయ వార్తలు, 1.30 నుంచి 1.45వరకు మహిళాభారతిలో వంటవార్పు తదితరాలు ఉంటాయి. తరువాత సాయత్రం 5వరకు బంద్. 5.15కి యువవాణి ప్రోగ్రాం ద్వారా పోటీ పరీక్షల కోసం క్విజ్, అభిప్రాయవేదిక యువతకు సంబంధించిన ప్రోగ్రాంలు ఉంటాయి. 6.30కి పల్లెప్రాంతాలు, రంగస్థలం, చెక్కభజన, ఫోక్‌సాంగ్స్, 6.50కి వ్యవసాయ సూచనలు, 7.15 నుంచి 7.45 వరకు పంటసీమలు, మార్కెట్‌ధరలు తదితరాలు, 7.45 నుంచి చిత్రలహరి ఉంటుంది. తరువాత ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, ఇంటర్వ్యూలు ఉంటాయి. 9గంటలకు న్యూస్ అట్ నైన్, జాతీయ స్థాయిలో జరిగిన వార్తల వివరాలు, 9.16కు స్పాట్‌లైట్ అంటే జాతీయ వ్యాప్తంగా ఆ రోజు వార్తలు, 10 నుంచి 11 వరకు శాస్త్రీయ సంగీతం ఉంటుంది.


40 ఏళ్లనాటి రేడియో కం టేప్ రికార్డర్

అప్రమత్తంగా ఉండండి..

● చిరుతపులి సంచారంపై గ్రామాల్లో దండోరా

నిమ్మనపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టూరు పంచాయతీ చల్లావారిపల్లి సమీపంలో బోడికొండ వద్ద దూడను చిరుతపులి చంపిన విషయం తెలిసిందే. అయితే శనివారం అటవీశాఖ అధికారి ఎఫ్‌బీవో దీప సమీప గ్రామాలలో పర్యటించి చిరుతపులి సంచారంపై దండోరా వేయించారు. ఆమె మాట్లాడుతూ చల్లావారిపల్లి సమీపంలో అటవీ ప్రాంతం ఉండడంతో రెండు రోజులుగా చిరుతపులి సంచరిస్తున్నట్లు తెలిపారు. పొలాల వద్దకు వెళ్లే రైతులు తగిన జాగ్రత్తలు వహించాలన్నారు. అయితే చిరుతపులి హాని చేస్తుందని సంహరించేందుకు కరెంటు వైర్లు తీయడం, మందులు పెట్టడం వంటివి చేయరాదని తెలిపారు. చిరుత కనిపించిన వెంటనే అటవీశాఖ అధికారులకు తెలియజేయాలని తెలిపారు. ప్రజలు రాత్రి సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని దండోరా వేయించారు.


చిరుత సంచారంపై దండోరా వేయిస్తున్న ఎఫ్‌బీవో దీప

యువకుడి ఆత్మహత్యాయత్నం

కురబలకోట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు మందలించారని యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన శనివారం మండలంలో జరిగింది. దీనికి సంబంధించి స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పిచ్చలవాండ్లపల్లెకు చెందిన రెడ్డికిరణ్‌రెడ్డి (23) డిగ్రీ వరకు చదువుకుని ఇంటి వద్దనే ఉన్నాడు. కాగా ఇతను జల్సాలు, బెట్టింగ్‌కు అలవాటు పడి పలువురి దగ్గర వద్ద అప్పులు చేశాడు. గతంలో ఇతను చేసిన అప్పులను తల్లిదండ్రులు తీర్చారు. ఈ నేపథ్యంలో మళ్లీ తల్లిదండ్రులు కొనిచ్చిన ద్విచక్రవాహనాన్ని తాకట్టు పెట్టి రూ.50 వేలు అప్పు చేసి బెట్టింగ్‌కు పాల్పడి డబ్బులు పోగొట్టుకున్నాడు. ఈ విషయాన్ని పలువురు అతడి తల్లిదండ్రుల దృష్టికి తీసుకురావడంతో అతన్ని మందలించడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు చికిత్సల నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు సమాచారాన్ని ఆసుపత్రి ఔట్‌పోస్టు సిబ్బంది ముదివేడు పోలీసులకు అందించారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

కలికిరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టపాళెం పంచాయతీ కుమ్మరపల్లె వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను డ్రైవరు అజాగ్రత్తగా నడపడంతో మోటారు సైకిల్‌పై వెళుతున్న యువకులు తీవ్ర ప్రమాదానికి గురయ్యారు. పోలీసు ఇన్‌స్పెక్టర్ కె.రెడ్డిశేఖర్‌రెడ్డి ఆదేశాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్న హెడ్ కానిస్టేబుల్ కొండప్ప తెలిపిన వివరాల ప్రకారం.. వాల్మీకిపురం మండలం గండబోయనపల్లె పంచాయతీ మేకలవారిపల్లెకు చెందిన యువకులు ప్రభాకర్ (23), గణేష్ (20), మనోహర్ (19)లు కలికిరి నుంచి ద్విచక్ర వాహనంలో రాత్రి 7 గంటల సమయంలో స్వగ్రామం వెళుతుండగా కుమ్మరపల్లె వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ మోటారు బైక్‌ను ఢీకొంది. డ్రైవర్ అజాగ్రత్తగా ట్రాక్టర్ నడపడంతో దానికున్న రోటావేటర్ కారణంగా ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో ప్రభాకర్ కాలు మోకాలి వరకూ తెగిపడింది. మిగతా ఇద్దరికి కూడా బలమైన గాయాలు తగిలాయి. ప్రభాకర్‌ను వెంటనే వేలూరు సీఎంసీకి తరలించారు. మిగతా ఇద్దరినీ తిరుపతి ఆసుపత్రికి పంపారు. ఇందులో ప్రభాకర్ ఇంజనీరింగ్ పట్టభద్రుడు కాగా మిగతా ఇద్దరు స్థానిక కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు. ప్రభాకర్ తల్లి మేకల వసంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

15న అరుణాచలంకు రెండు ఆర్టీసీ బస్సులు

మదనపల్లె అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈనెల 15వ తేదీ గిరి ప్రదక్షిణకు మదనపల్లె ఆర్టీసీ వన్ డిపో నుంచి రెండు అల్ట్రా డీలక్స్ బస్సులు నడుపుతున్నట్లు ఆ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులు బయలుదేరుతాయని చెప్పారు. ఒక్కరికి రానుపోను టికెటు ధర రూ.805గా నిర్ణయించినట్లు తెలిపారు. అరుణాచలం వెళ్లే భక్తులు టికెట్లు రిజర్వేషన్ చేయించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు, బుకింగ్ కోసం డిపో మేనేజరు 9959225676, 7382875034, 9440858510కు సంప్రదించాలన్నారు.

10లోపు అభ్యంతరాలు తెలియచేయాలి

మదనపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు పాలకవర్గానికి జరగబోయే ఎన్నికలకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 10వ తేదీ లోపు లిఖితపూర్వకంగా తెలియచేయాలని మదనపల్లె కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు సీఈవో పీవీ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మదనపల్లె కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు పాలకవర్గానికి ఈనెల 28న ఎన్నికలు జరుగుతాయని, ఇందుకు సంబంధించిన ఓటరు లిస్టు (ఏ-క్లాసు మెంబర్ల లిస్టు)ను బ్యాంకు నోటీసు బోర్డులో ప్రకటించినట్లు తెలిపారు. దీనిపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 10వ తేదీ లోపు బ్యాంకు సీఈవోకు రాతపూర్వకంగా తెలియచేయాలని తెలిపారు. 11న తుది ఓటరు జాబితాను ప్రకటిస్తారన్నారు. గుర్తింపు కార్డు లేని ఏ-క్లాసు మెంబర్లు వెంటనే రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీని బ్యాంకులో అందచేసి గుర్తింపు కార్డు పొందాలని పేర్కొన్నారు.

ఇచ్చేది గోరంత.. లాక్కునేది కొండంత

● ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ధ్వజం

వేంపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇస్తున్నది గోరంత... లాక్కుంటున్నది కొండంత అని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం ఆయన వేంపల్లెలో విలేకరులతో మాట్లాడుతూ ఉచిత గ్యాస్ పథకం పేరుతో ప్రభుత్వం ఏడాదికి ప్రజలకు ఇస్తున్నది రూ.2,684 కోట్లు, కరెంటు సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజల నుంచి లాక్కుంటున్నది రూ.6,073 కోట్లు అన్నారు. ఇదికాక మరొకసారి సర్దుబాటు చార్జీల పేరుతో రూ.11,826 కోట్లు అదనపు భారం మోపబోతోందన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం ఉచిత గ్యాస్ పథకం అమలు కావడం లేదన్నారు. ప్రతి ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తామని మేనిఫెస్టోలో చెప్పారన్నారు. రాష్ట్రంలో 180 లక్షల కుటుంబాలు ఉన్నాయన్నారు. అందులో 154 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. 154 లక్షల గ్యాస్ కనెక్షన్లకు ఉచిత గ్యాస్ ఇవ్వాలంటే ఏడాదికి రూ.4,000 కోట్లు కావాలి, కానీ ప్రభుత్వం రూ.2,684కోట్లు మాత్రమే ఇస్తోందన్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

● సుమో, ఒక కారుతో సహా 50 కేజీల గంజాయి స్వాధీనం
● వివరాలు వెల్లడించిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న నలుగురు అంతర్‌రాష్ట్ర స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. శనివారం రాయచోటిలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిందితుల వివరాలను ఎస్పీ మీడియాకు వెల్లడించారు. రాజంపేట డీఎస్పీ సుధాకర్ ఆధ్వర్యంలో రైల్వేకోడూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వర్లు, అర్బన్ ఇన్‌స్పెక్టర్ హేమసుందర్‌రావు, రాజంపేట రూరల్ ఇన్‌స్పెక్టర్ బీవీ రమణ, ఓబులవారిపల్లె తహసీల్దార్ శ్రీధర్‌రావు, ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్ సిబ్బందితో కలిసి మంగంపేట సమీపంలోని చెన్నకేశవగుడి సమీపంలో జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక సుమో, ఒక కారులో ముగ్గురు మగవారు, ఒక మహిళ సుమారు 10 లక్షల విలువ చేసే 50 కేజీల గంజాయిని తిరుపతికి తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు తెలిపారు.

నాలుగు ఎర్రచందనం కేసులు, నాలుగు గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్న పుల్లంపేట మండలం రంగంపల్లికి చెందిన కల్లపల్లి నాగేంద్ర, అతడితో సహజీవనం చేస్తూ తిరుపతి పట్టణం గాంధీనగర్‌కు చెందిన అన్నామలై ఆచారి భార్య కుమారి, కేరళ రాష్ట్రానికి చెందిన రెండు గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్న బాపురాజన్‌శ్రీని, చిత్తూరు జిల్లా పలమనేరు మండలం కాకతోపు వీధికి చెందిన షేక్ సలీంబాషాలు అరెస్టయిన వారిలో ఉన్నారన్నారు. ఈ గంజాయి అక్రమ రవాణా, విక్రయాల్లో వీరితో పాటు మరికొంతమంది ప్రమేయం ఉందని తెలిపారు.

వీరిపై ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పెట్టనున్నట్లు ఎస్పీ తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి అక్రమ రవాణా విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, అక్రమ రవాణా చేసినా, అందుకు సహకరించినా వారిపై నాన్ బెయిలబుల్ కేసులు పెడతామని ఎస్పీ హెచ్చరించారు. అలాగే గంజాయి అక్రమ రవాణా కేసుల్లో ఎక్కువ సార్లు దొరికిన వారిపై పీడీ యాక్టు అమలు చేస్తామన్నారు. గంజాయి అక్రమ రవాణా కేసులో ముద్దాయిలను అరెస్టు చేయడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. గంజాయి కేసులో ముద్దాయిలను పట్టుకోవడంలో భాగంగా ప్రమాదవశాత్తు ఓబులవారిపల్లె ఎస్ఐ మహేశ్‌నాయుడు కిందపడి చేతికి గాయాలైనప్పటికీ లెక్కచేయకుండా నిందితులను అరెస్టు చేసినందుకు ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

యువతకు భరోసా కల్పించిన నారా లోకేశ్ అమెరికా పర్యటన

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేమన సతీశ్


అమెరికాలో నారా లోకేశ్‌తో వేమన సతీశ్

రాజంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రగతికి యువత భవితకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటన ఎంతో ఉపయోగపడిందని తానా మాజీ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేమన సతీశ్ తెలిపారు. మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటన ఆద్యంతం తాను నారా లోకేశ్‌తో గడిపానని అన్నారు. నారా లోకేశ్‌తో పాటు అమెరికా పర్యటనలో పాల్గొని ఆయనతో పాటు తిరుగు ప్రయాణం సందర్భంగా వేమన సతీశ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణం తీరిక లేకుండా అమెరికాలో పలు ప్రఖ్యాత కంపెనీలతో సుదీర్ఘ చర్చలు జరిపి రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన అవకాశాలు వివరిస్తూ ఆయన చేసిన ప్రసంగం అక్కడి పారిశ్రామికవేత్తలను ఆకట్టుకుందన్నారు. ఆయన అమెరికా పర్యటన వల్ల ఎన్నో పరిశ్రమలు రాష్ట్రానికి రానున్నాయని తెలిపారు.

పాత సామాన్లు అమ్ముతాం

● ధరలు మాత్రం తగ్గించం ● ఎక్సైజ్ శాఖ వింత నిర్ణయం



మదనపల్లె ఏపీఎస్‌బీసీఎల్ డిపోలో భద్రపరచిన పాత ఫ్రీజర్లు, బ్యాటరీలు

మదనపల్లె టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా.. ఏవైనా వస్తువులు కొనుగోలు చేసి వాటిని ఐదేళ్ల పాటు ఉపయోగించాక, వాటిని తిరిగి అమ్మాలంటే తరుగు (డిప్రిసియేషన్) తీసేసి విక్రయిస్తారు. ద్రవ్యోల్బణం సూత్రం ప్రకారం వస్తువులు వాడిన ఏడాదికి ఎంత లేదన్నా కొనుగోలు ధరలో 10 శాతం తీసివేసి అమ్మడం చూస్తుంటాం. కానీ రాష్ట్ర అబ్కారీ శాఖ మాత్రం ఐదేళ్ల పాటు ఉపయోగించిన వస్తువులను బుక్‌వాల్యూ ధర కన్నా అదనంగా విక్రయించాలని ఉత్తర్వులు జారీ చేసింది. అదీకాక ఆ వస్తువులను బహిరంగ వేలంలో విక్రయించడంతో పాటు, వచ్చిన ధరకు అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొనడం చూస్తే ఇదెంత వింత నిర్ణయమో చూసే వారిని విస్మయం కలిగించకమానదు.

జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో 109 ప్రభుత్వ మద్యం దుకాణాలు నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక నూతన ఎక్సైజ్ పాలసీ విధానం తీసుకొచ్చి ప్రభుత్వ మద్యం దుకాణాలను ఎత్తివేసింది. ఈ క్రమంలో జిల్లాలోని ఎనిమిది ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలోని 109 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో వినియోగించిన ఫ్రీజర్లు, ఇన్వర్టర్లు, బ్యాటరీలు, లేబుల్ స్కానర్లు, క్యాష్ కౌంటింగ్ మిషన్లు, క్యాష్ చెస్ట్‌లు అన్నింటిని కలిపి ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకుని మదనపల్లె, కడప ఏపీఎస్‌బీసీఎల్ డిపోలకు తరలించారు. వీటితో పాటు గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మిగిలిపోయిన మద్యంను కూడా డిపోలకు తరలించారు.

వేలంలో కొనుగోలు చేయండి

రాష్ట్రంలోని ప్రభుత్వం మద్యం దుకాణాల్లో స్వాధీనం చేసుకున్న పాత సామాన్లను బహిరంగ వేలంలో విక్రయించాలని ఎక్సైజ్‌శాఖ (ఏపీఎస్‌బీసీఎల్) బోర్డు డైరెక్టర్లు గత నెల 23వ తేదీ సమావేశమై తీర్మానించారు. ఈ మేరకు ఏపీఎస్‌బీసీఎల్ ఎండీ రాష్ట్రంలోని అన్ని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్లకు, ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్లకు ఉత్తర్వులను పంపారు. అంతా సక్రమంగా ఉంటే ఇందులో పెద్ద వింతేమి లేదు..కానీ ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి స్వాధీనం చేసుకున్న ఫ్రీజర్లు, ఇన్వర్టర్లు, బ్యాటరీలు, లేబుల్ స్కానర్లు, క్యాష్ కౌంటింగ్ మిషన్లు, క్యాష్ చెస్ట్‌లకు బుక్ వాల్యూ నిర్ణయించారు. ఈ ధరల కన్నా 20 శాతం అప్‌సెట్ ధరలు నిర్ణయించి బహిరంగ వేలం నిర్వహించి హెచ్చు పాటదారుడికి విక్రయించాలని ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవంగా హారిజాంటల్ ఫ్రీజర్ (బీర్లు కూలింగ్ చేసేవి) 1000 లీటర్ల సామర్థ్యం ఉండేవి మార్కెట్‌లో రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ధరలు ఉన్నాయి. ఐదేళ్ల పాటు ఈ ఫ్రీజర్లు ఉపయోగించిన దరిమిలా వీటి డిప్రిసియేషన్ ఎంత లేదన్నా ఏడాదికి రూ.3 వేలు చొప్పున ఐదేళ్లకు రూ.15 వేలు తీసివేయాల్సి ఉంది. అంటే ఉపయోగం (ఆపరేటింగ్‌లో) ఉన్న ఫ్రీజర్ ధరలు గరిష్టంగా రూ.10 నుంచి రూ.15 వేల వరకు వెచ్చించి తీసుకోవచ్చని ఫ్రిజ్ మెకానిక్‌లు చెబుతున్నారు. అవే ఫ్రీజర్లో అమ్మోనియం గ్యాస్ లీకేజి అయిపోయి, మరమ్మతులకు గురైన ఫ్రీజర్లను రూ.5 వేల వరకు కొనుగోలు చేయవచ్చని మెకానిక్‌లు చెబుతున్నారు. కానీ వాస్తవంగా ఎక్సైజ్‌శాఖ అధికారులు నిర్ణయించిన ధరల ప్రకారం ఫ్రీజర్ ధర బుక్ వ్యాల్యూ ప్రకారం రూ.18,900 ఉండగా, అప్‌సెట్ ధరను 20 శాతం పెంచి రూ.22,680గా నిర్ణయించారు. ఈ ధరను అప్‌సెట్ ధరగా (సర్కారు పాట) పెట్టి బహిరంగ వేలం నిర్వహించి హెచ్చుపాటదారుడు ఎవరైనా ఉంటే వారికి ఫ్రీజర్‌ను అప్పగిస్తారు. అంతేకాదు సుమా ఈ పాటదారుడు పాడిన ధరకు అదనంగా 18 శాతం జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంది. ఇదే కోవలో ఇన్వర్టర్లు, బ్యాటరీలు, లేబుల్ స్కానర్లు (అన్నీ ఎలక్ట్రానిక్ వస్తువులే) ధరలు కూడా బుక్ వ్యాల్యూకి 20 శాతం అదనంగా అప్‌సెట్ ధరలు నిర్ణయించారు. అసలే ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆపై ఐదేళ్ల పాటు వాడి పడేశారు. వీటి ప్రస్తుత ధరలు మార్కెట్‌లో ఏ సామాన్యుడిని అడిగినా టక్కున ఎంతకు కొనుగోలు చేయవచ్చో ఇట్టే చెప్పేస్తారు. అలాంటి ఫ్రీజర్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను ఎక్కువ ధరలకు బహిరంగ వేలంలో విక్రయించాలని ఎక్సైజ్‌శాఖ అధికారులు తీసుకున్న వింత నిర్ణయంతో ఈనెల 7వ తేదీ కడప, మదనపల్లె ఏపీఎస్‌బీసీఎల్ డిపోల్లో నిర్వహించే పాత సామాన్ల బహిరంగ వేలంలో ఈ పాత సామానులు అమ్ముడుపోతాయా..? అన్నదే వెయ్యి డాలర్ల ప్రశ్నగా మారనుంది.

పారదర్శకంగా ఎక్సైజ్ వస్తువుల వేలం

● డిపో మేనేజర్ శ్రీనివాసులు


మాట్లాడుతున్న ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్

మదనపల్లె ఎక్సైజ్ డిపో పరిధిలో స్వాధీనం చేసుకున్న వస్తువులను పారదర్శకంగా వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ డిపో మేనేజర్ వి.శ్రీనివాసులు తెలిపారు. శనివారం పుంగనూరు రోడ్డులోని ఏపీఎస్‌బీసీఎల్ డిపోలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపో పరిధిలోని 69 ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి స్వాధీనం చేసుకున్న ఫ్రీజర్లు, ఇన్వర్టర్ బ్యాటరీలు, స్కానర్లు, క్యాష్ కౌంటింగ్ మిషన్లు, క్యాష్ చెస్ట్‌లను డిపోలో భద్రపరిచామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ వస్తువులను ఈనెల 7వ తేదీ డిపో ఆవరణంలో బహిరంగ వేలం వేస్తామన్నారు.

ఆసక్తి గల వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. హెచ్చుపాటదారుడికి ఆయా వస్తువులను అప్పగిస్తామన్నారు. అలాగే డిస్టిలరీల నుంచి వచ్చే స్టాకు ఆధారంగా డిపో పరిధిలోని 69 ప్రైవేటు మద్యం దుకాణాలను విభజించి, రేషన్ ప్రకారం సరఫరా చేస్తున్నామన్నారు. వేలం పాట నిర్వహణ వివరాల కోసం స్టోర్ మేనేజర్ 9701777938, 8639494220, 9866144462 నెంబర్లకు ఫోన్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఆదికేశవులు, సీఐ ప్రశాంత్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వం ఏదైనా మేం చెప్పేదే జరగాలి, మేం వచ్చేదే సమయం. అధికారులు ఎవరు వచ్చినా మాకోసం నిరీక్షించాల్సిందే. ఉమ్మడి జిల్లా అధికారులు అన్ని పనులను వదులుకుని జిల్లా, డివిజన్, అధికారులు సమావేశానికి వస్తుంటారు. అయినా వైసీపీ అధీనంలోని జడ్పీ పాలకమండలి సభ్యులు (జడ్పీటీసీలు) స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని మరిచి చైర్‌పర్సన్ చాంబర్‌లో ముచ్చట్లలో మునిగిపోయారు. జడ్పీ సీఈఓ ఓబులమ్మ కూడా చాంబర్‌కు వెళ్లి నేను సైతం అంటూ వారితో మమేకమయ్యారు. ఆయా శాఖల జిల్లా అధికారులను 45 నిమిషాలు నిరీక్షింప చేయడంతో వారు తీవ్ర అసహనానికి లోనయ్యారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో ఇలాంటి నిరీక్షణ సహజమేనని టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కూడా కొనసాగుతుండడంపై అధికారులు అవాక్కవుతున్నారు. అధికారి స్థాయి ఏదైనా తప్పదన్నట్లు వేచిచూడాల్సిందే అన్నట్లుగా జరిగింది. వివరాల్లోకెళితే...

మేం వచ్చేదే సమయం

● స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని పట్టించుకోని వైసీపీ పాలకమండలి
● చైర్‌పర్సన్ చాంబర్‌లో మాటా మంతీ ● నేను సైతం అన్న సీఈఓ
● అసహనానికి లోనైన అధికారులు ● రెండు గంటలకే మమ...! ● నవ్విపోదురుగాక మాకేంటి




జడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శారద, సీఈఓ ఓబులమ్మ తదితరులు - వైసీపీ పాలక వర్గం కోసం ఎదురు చూస్తున్న అధికారులు

కడప రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సమావేశహాలులో శనివారం నిర్వహించిన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం నవ్విపోదురుగాక మాకేంటి అన్నట్లుగా కొనసాగింది. ఉదయం 10 గంటలకు ప్రారంభించాల్సిన సమావేశాలను 45 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభించారు. (ఉమ్మడి కడప జిల్లా) కడప, అన్నమయ్య జిల్లాల నుంచి దాదాపు 30 శాఖల అధికారులు నిర్వాహకులు నిర్దేశించిన సమయానికి హాజరయ్యారు. వైసీపీ అధీనంలోని జడ్పీ పాలకమండలి (జడ్పీటీసీలు) చైర్‌పర్సన్ చాంబర్‌లో ముచ్చట్లలో మునిగిపోయారు. జడ్పీ సీఈఓ ఓబులమ్మ కూడా వారితో మమేకమయ్యారు. సమావేశ నిర్వాహకులు తమ బాధ్యతను పక్కనపెట్టి వైసీపీ పాలకమండలి చుటూ ప్రదక్షిణలు చేస్తుండడంతోనే సమావేశాలు ఆలస్యంగా కొనసాగుతున్నాయన్న విమర్శలు చక్కర్లు కొడుతున్నాయి. చివరికి ఓ అధికారి చైర్‌పర్సన్ చాంబర్‌కువెళ్లి 10-45 నిమిషాలు కావస్తోంది అధికారులు నిరీక్షిస్తున్నారని చెబితే సమావేశం ప్రారంభించారు.

ప్రేక్షక పాత్రలో కమిటీల చైర్మెన్లు

స్థాయీ సంఘాల కమిటీల సమావేశంలో ఆయా కమిటీల చైర్మెన్‌లు ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారు. జడ్పీ చైర్‌పర్సన్ జె. శారద ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణ అభివృద్ధి, విద్య, వైద్య సేవల, పనుల, మహిళా సంక్షేమం స్థాయీ సంఘాలకు చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. కానీ ఆయా సంఘాల సమీక్షలో జడ్పీ చైర్‌పర్సన్ ఒక్క మాటకూడా మాట్లాడకుండా ఉత్సవ విగ్రహంలా ప్రేక్షక పాత్రవహించారు. సాంఘిక సంక్షేమం స్థాయీ సంఘానికి చిట్వేలి జడ్పీటీసీ పుష్పలత చైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఈమె కూడా తమ కమిటీ చర్చలో ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారు. వ్యవసాయం స్థాయీ సంఘానికి పిట్టు బాలయ్య(జడ్పీ రెండో చైర్మెన్) చైర్మెన్‌గా ఉన్నారు. ఈయన మాత్రం వ్యవసాయ, అనుబంధశాఖల చర్చలో ఒకటి, రెండు పసలేని ప్రశ్నలను సంధించి వారికంటే ఈయనే నయమనిపించారు.

అంతా గందరగోళం

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలను నిర్వాహకులు గందరగోళంగా నిర్వహించారు. కమిటీలోని ఆయాశాఖల అధికారుల సమీక్ష జరుగుతుండగానే మరో కమిటీశాఖలపై సభ్యులు ప్రశ్నలను సంధించారు. దీంతో ఏ అధికారి ఏ సమాధానం చెప్పాలో అర్థం కాక గడిబిడ ఏర్పడింది. ఒక రకంగా చెప్పాలంటే క్రమశిక్షణ ఉల్లఘించారనే అపవాదు నెలకొంది. గ్రామీణ అభివృద్ధి స్థాయీ సంఘం సమావేశం పరిధిలోని ఆయా శాఖల అధికారులు వేదికపైకి వచ్చి సమాధానాలు వినిపిస్తుండగానే వ్యవసాయ స్థాయీ సంఘం ఉద్యానశాఖ సభ్యులు ప్రశ్నలు అడిగారు. దీంతో ఎవరు, ఎవరికి ఏ సమాధానం చెప్పాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది.

అరకొరగా సమస్యలపై చర్చ

జడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో ఆయా శాఖల సమీక్షను అరకొరగా చర్చసాగించారు. మొత్తం ఏడు స్థాయీ సంఘాల్లో మూడు, నాలుగు మాత్రమే చర్చించి మిగిలిన వాటిని మడతపెట్టేశారు. ప్రణాళిక, ఆర్థికస్థాయీ సంఘ పరిధిలో ముఖ్యమైన శాఖలను వదిలి పీఆర్ ఇంజనీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, మైన్స్ శాఖలను మాత్రమే చర్చించి వదిలేశారు. గ్రామీణ అభివృద్ధి సంఘంలో మొత్తం ఏడు శాఖల్లో డీఆర్‌డీఏ, డ్వామాపై మాత్రమే చర్చించారు. విద్య, వైద్యసేవల స్థాయీ సంఘంలో మొత్తం 9 శాఖల్లో డీఎంఅండ్‌హెచ్‌ఓ, డీఈఓ శాఖలపై మాత్రమే అరకొరగా చర్చించారు. వ్యవసాయ స్థాయీ సంఘంలో మొత్తం 12 శాఖల్లో కేవలం వ్యవసాయశాఖ, ఉద్యానశాఖలపైనే బరువుబరువుగా చర్చించి చేతులు దులిపేసుకున్నారు.

మొక్కుబడి సమావేశాలు

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలను మొక్కుబడిగా నిర్వహించారు. గతంలో ఆయా స్టాండింగ్ కమిటీ సమావేశాలను ఆయా కమిటీల చైర్మెన్‌ల ఆధ్వర్యంలో ఒక్కొక్కటిగా నిర్వహించేవారు. ఈసారి మూకుమ్మడిగా అన్ని కమిటీల సమావేశాలను నిర్వహించారు. దీంతో ఒక కమిటీలోని సభ్యులు మరో కమిటీ ప్రశ్నలను లేవనెత్తి గందరగోళానికి నాందిపలికారు.

రెండు గంటలకే మమ

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వాహకులు రెండుగంటలకే మమ అనిపించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభించాల్సిన సమావేశాన్ని 10:45 గంటలకు ప్రారంభించి 1 గంటకు ముగించి ఓ పనైపోయిందనిపించారు.

పేలవంగా సమావేశం

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని పేలవంగా నిర్వహించారు. ఆయా శాఖల అధికారులతో సంఘ సభ్యులు(జడ్పీటీసీలు) శాఖల పనితీరు, సంక్షేమ పథకాలపై అరొకొరగా పసలేని చర్చ కొనసాగించారు. జడ్పీ వైస్ చైర్మెన్ పిట్టు బాలయ్య యాదవ్, కో-ఆప్షన్ సభ్యులు అచ్చుకట్ల కరీముల్లా, పోరుమామిళ్ల జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వేంపల్లె జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, రామాపురం జడ్పీటీసీ వెంకటరమణ, బి.కోడూరు జడ్పీటీసీ దావీదు, కమలాపురం జడ్పీటీసీ ఎల్. సుమిత్రా తదితరులు పలు మండలాల్లో అసమతుల్య వర్షాల కారణంగా ఖరీఫ్ పంటలు ఎండి రైతులు అల్లాడుతున్నారని, ఆయా మండలాలను కరువు మండలాలుగా గుర్తించడంలో వ్యవసాయశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో వైఎస్ఆర్ జలకళ ద్వారా వేసిన బోర్లకు మోటార్లను అమర్చలేదని పైగా విద్యుత్ సరఫరా ఇంత వరకు ఇవ్వకపోవడం దారుణమని పోరుమామిళ్ల జడ్పీటీసీ చెన్నయ్య అడిగారు. జిల్లాలోని ఆయా షాదిఖానాల ద్వారా వచ్చే ఆదాయం ఏ ఖాతాలో జమ అవుతుందో తెలియడంలేదని వాటి వివరాలను తెలపాలని పలు సమావేశాల నుంచి కోరుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని కో-ఆప్షన్ సభ్యులు ఎ. కరీముల్లా మండిపడ్డారు. ఆర్‌బీకేల నిర్మాణాలకు బిల్లులు సక్రమంగా రావడంలేదని వాటిని వెంటనే చెల్లించాలని, కడప - పులివెందుల మార్గంలోని ఎల్లటూరు వద్ద రోడ్డుపై వర్షపు నీరు నిలబడడంతో రోడ్డు అధ్వాన్నంగా ఉందని వీటి పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే చేపట్టాలని జడ్పీ వైస్‌చైర్మన్ బాలయ్య పేర్కొన్నారు. పోరుమామిళ్ల మండలంలో నాడు-నేడు పథకం ద్వారా చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయని వాటిని పూర్తిచేయాలని జడ్పీటీసీ చెన్నయ్య తెలిపారు. అభివృద్ధి పనులకు జడ్పీటీసీల నుంచి కూడా ప్రతిపాదనలు తీసుకోవాలని, మండల స్థాయిలోని హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీలో సభ్యులుగా ఉంచాలని వేంపల్లె జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, జడ్పీ వైస్‌చైర్మెన్ బాలయ్య యాదవ్ కోరారు. సమావేశాల్లో డిప్యూటీ సీఈఓ మైథిలి, ఆయాశాఖల అధికారులు, జడ్పీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి



రక్తపు మడుగులో పడివున్న ప్రవీణ్ మృతదేహం

సిద్దవటం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కడప - చెన్నై జాతీయ రహదారిపై జేఎంజే కాలేజ్ కోతులు తూము వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రవీణ్(19) అక్కడికక్కడే మృతి చెందగా రోహిత్ కుమార్(20) చికిత్స పొందుతూ మృతి చెందారు. వివరాల్లోకెళితే....

అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం ఇసుకపల్లె యువకులు ప్రవీణ్, రోహిత్‌కుమార్ కడప నుంచి రాజంపేటకు బైక్‌లో వెళుతుండగా తిరుపతి నుంచి కడపకు వస్తున్న పులివెందుల డిపో ఆర్టీసీ బస్సు జేఎంజే కాలేజీ వద్ద బైక్‌ను ఢీకొంది. దీంతో ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రగాయాలపాలైన రోహిత్‌ను వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రోహిత్ మృతి చెందాడు. సిద్దవటం పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీసుల అదుపులో చైన్ స్నాచర్



షేక్ ఆజాం అలి అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ

మైదుకూరు రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో చైన్ లాక్కెళ్లిన షేక్ ఆజాం అలి సేట్‌ను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్పీ రాజేంద్రప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ మైదుకూరులో దసరా వేడుకల్లో అమ్మవారిశాల వద్ద నిలబడి ఉన్న మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లిన నిందితుడిని సీఐ హసం, ఎస్ఐ మద్దిలేటి ముమ్మరంగా గాలించారు. కడప పట్టణం మోచంపేటకు చెందిన షేక్ ఆజాం అలి సేట్‌ని మైదుకూరు బైపాస్ వద్ద అదుపులోకి తీసుకుని విచారించగా ఇతనిపై మైదుకూరు, ప్రొద్దుటూరు, మన్నూరు పోలీస్‌స్టేషన్లలో మూడు చైన్ స్నాచింగ్ కేసులు, మైదుకూరులో మోటార్ సైకిల్ చోరీ కేసు ఉన్నట్లు తేలినట్లు డీఎస్పీ తెలిపారు. ఇతని నుంచి రెండు మోటార్‌సైకిళ్లు, 70.5 గ్రాముల బరువు గల నాలుగు బంగారు చైన్‌లు స్వాధీనం చేసుకున్నారు. షేక్ ఆజాం అలిని పట్టుకోవడానికి సహకరించిన వారిలో కానిస్టేబుల్స్ రమణ, శివ, గణేష్, నవీన్, తిరుమలయ్య ఉన్నారు.

ఉర్దూ సెమినార్‌కు అమీర్‌బాబు లక్ష విరాళం



మంత్రి ఫరూక్‌కు లక్ష రూపాయల చెక్కును అందిస్తున్న అమీర్‌బాబు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంజుమన్ తరఖ్ఖీ ఉర్దూ ఆధ్వర్యంలో ఈ నెల 9న నిర్వహించనున్న జాతీయ ఉర్దూ సెమినార్‌కు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్ బాబు లక్షరూపాయలు విరాళం ప్రకటించారు. శనివారం రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు లక్ష రూపాయలు చెక్కు అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు ఉర్దూ మాధ్యమాన్ని పటిష్టపరచాలని కోరారు. ఈ సంస్థల్లోని అన్ని ఖాళీలు భర్తీ చేసి మైనార్టీ విద్యార్థులు నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. మంత్రి ఫరూక్ స్పందిస్తూ ఖాళీ ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర అంజుమన్ తరఖ్ఖీ అధ్యక్షుడు సత్తార్‌సాహిర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అష్రఫ్‌అలీఖాన్, నజీర్ అహ్మద్, జిలానీబాషా, సలావుద్దీన్, మగ్బూల్ అహ్మద్, సిరాజుద్దీన్ బుకారి తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం

● మెప్మా పీడీ సురేశ్‌రెడ్డి

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టరు సురేశ్‌రెడ్డి అన్నారు. రెండురోజుల పాటు నిర్వహించిన మెప్మా ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్ జిల్లాస్థాయి వర్క్‌షాపునకు శనివారం ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నిజమైన లబ్ధిదారులను గుర్తించడానికి వారి సామాజిక ఆర్థిక స్థితిగతులు వాస్తవిక సమాచారంతో కచ్చితమైన డేటాబేస్ అవసరమన్నారు. ప్రామాణికమైన డేటాను కలిగి ఉండడానికి ఎస్‌హెచ్‌జీ సభ్యుల జనాభా, ఆర్థిక వృత్తిపర వివరాలను కవర్ చేస్తూ డేటా వ్యారిఫికేషన్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. దీనికోసం కోసం మెప్మా ఎండీ ఆధ్వర్యంలో ఒక ఆండ్రాయిడ్ అప్లికేషన్ అభివృద్ధి చేశారన్నారు. దీని ద్వారా రిసోర్స్ పర్సన్స్ (ఆర్‌పీలు) అన్ని గ్రూపుల్లోని సభ్యుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారని తెలిపారు. ఇందులో సీవోలు, సీఎంఎంలు, టీఈలు చివరగా పీడీ ఈ డేటాను ధ్రువీకరించి డిసెంబరు చివరి నాటికి డేటా మొత్తం వ్యారిఫై చేస్తారన్నారు. జిల్లా స్థాయి వర్క్‌షాపులో కింది స్థాయి సిబ్బందికి ఈ మొబైల్ యాప్‌లో ఎలా అప్‌లోడ్ చేయాలో శిక్షణ ఇచ్చారు.

వైవీయూ ఎంబీఏ పరీక్ష ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైవీయూ ఎంబీఏ హెచ్‌ఆర్ఎం నాలుగో సెమిస్టరు ఫలితాలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ క్రిష్ణారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసరు క్రిష్ణారావు ఎంబీఏ విభాగం డీన్ ప్రొఫెసరు సుబ్బరాయుడు విడుదల చేశారు. శనివారం వీసీ చాంబరులో ఫలితాలు విడుదల చేసిన ఆయన మాట్లాడుతూ ఎంబీఏ హెచ్‌ఆర్ఎంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. విద్యార్థులను అధ్యాపకులను వారు అభినందించారు.

నీళ్ల కోసం రోడ్డెక్కిన మహిళలు

ఇరవై రోజులుగా నీటిని విడుదల చేయని అధికారులు

బిందెలతో హరిజన మహిళల ఆందోళన



నీళ్ల కోసం బిందెలతో రోడ్డెక్కిన మహిళలు

పులివెందుల టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రిష్టియన్ లైన్‌లో నీళ్ల కోసం మహిళలు రోడ్డెక్కారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ సొంత ఊర్లో నీళ్ల కోసం మహిళలు బిందెలతో రోడ్డుపై నిరసన చేయడం చర్చనీయాంశంగా మారింది. శనివారం ఉదయం క్రిస్టియన్‌లైన్‌లో మహిళలందరూ బిందెలు తీసుకుని రోడ్డుపైకి వచ్చి మాకు నీళ్లు ఇప్పించే నాధుడే లేరా అంటూ నిరసన వ్యక్తం చేశారు. కేవలం దళితులమని, మాలలమనే మాకు నీటి సరఫరా చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని హరిజన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. హరిజనులకు నీళ్ల అవసరం ఉండవా అంటూ ప్రశ్నించారు. కనీసం బాత్‌రూం వెళ్లడానికి కూడా నీళ్లు లేవని అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని 20 రోజులుగా చుక్క నీరు కూడా విడుదల చేయలేదని మేమే రూ.600 చెల్లించి ట్యాంకు నీల్లు తెప్పించుకోవాల్సి పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ఎన్నిరోజులు నీళ్లు తెచ్చుకోవాలా అని, మేం కూడా పన్నులు కడుతున్నామని మాకు మీరు ఎందుకు ఇవ్వరంటూ వారు వాపోయారు. కౌన్సిలర్ దృష్టి కి తీసుకెళ్తే ఒక ట్యాంకు పంపించారని, ఒక ట్యాంకు నీళ్లుమూడు వీధులకు ఎలా సరిపోతాయన్నారు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు అధికారులు కానీ మా మొర విని మాకు తాగునీటి సమస్య లేకుండా చేయాలని వారు కోరారు.

ఎంటీఎంను అమలు చేయండి



ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

వేంపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మినిమిమ్ టైంస్కేల్ అమలుచేయాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని, దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అమలు చేయించాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డికి అధ్యాపకులు విజ్ఞప్తి చేశారు. శనివారం ట్రిపుల్‌ఐటీ అధ్యాపక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పులివెందులలో ఉన్న ఎమ్మెల్సీని కలిసి వినతిపత్రం అందించారు. నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో 400కు పైగా అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, శాశ్వత ప్రాతిపదికన భర్తీచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకునేలా దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

పోలీసు సొసైటీపై విచారణ

కడప (క్రైం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పోలీసు వెల్ఫేర్ సొసైటీ డబ్బు వ్యత్యాసం ఉండడంతో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టినట్లు తెలిసింది. పోలీసు సిబ్బంది అవసరాల నిమిత్తం సొసైటీలో రుణం తీసుకుని తిరిగి చెల్లిస్తుంటారు. దాదాపు సొసైటీలో రూ.60 లక్షల మేర వ్యత్యాసం రావడంతో ఎస్పీ విచారణకు ఆదేశించారు.

అవినీతి ఆరోపణలపై కానిస్టేబుల్ సస్పెన్షన్

బద్వేలుటౌన్, నవంబరు2, (ఆంధ్రజ్యోతి): బద్వేలు అర్బన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ నాగసుబ్బయ్య సస్పెన్షన్‌కు గురయ్యారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నట్లు ఫిర్యాదులు రావడంతో ఆ కానిస్టేబుల్‌ను సస్పెండ్‌చేసినట్లు సమాచారం.

వివాహిత ఆత్మహత్య

కడప క్రైం , నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కడపనగరం కాగితాలపెంటలో వివాహిత షేక్ ఫిర్‌దోస్ (40) ఉరి వేసుకున్నట్లు కడప తాలుకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సీఐ వివరాల మేరకు.. కాగితాల పెంటకు చెందిన షేక్ ఫిర్‌దోస్ కడప వాసి కరీముల్లాతో 17 ఏళ్ల కిందట వివాహం మైంది. కొన్ని నెలలుగా భర్త వేధింపులు తాళలేక తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతురాలి బంధువుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసి విచారిస్తున్నామని తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



పెంచలయ్య మృతదేహం

రాజంపేట టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వెంకటరాజంపేట గ్రామంలో శనివారం ఉదయం కారు ఢీకొని పెనగలూరు పెంచలయ్య(68) అక్కడికక్కడే మృతిచెందాడు. తిరుపతి నుంచి కడప వైపునకు వెళుతున్న కారు అదుపు తప్పి పెంచలయ్యను ఢీకొంది. తలకు తీవ్ర గాయాలవడంతో మృతి చెందాడు. మన్నూరు సీఐ రామాంజనేయులు, పోలీసులు ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృత దేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జీవిత ఖైదీ పరార్

కడప (క్రైం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కడప సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఓ జీవిత ఖైదీ పరారయ్యాడు. దీంతో జైలు అధికారులు అతన్ని శనివారం అదుపులోకి తీసుకున్నారు. తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి తిరుపతికి సంబంధించిన ఓకేసులో కడప సెంట్రల్ జైలులో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్నాడు. అతను సత్ప్రవర్తనతో ఉండడంతో బేకరీలో పనిచేసేందుకు అధికారులు అనుమతించారు. ఇదే అదనుగా భావించిన ఆ ఖైదీ రెండు రోజుల కిందట పరారయ్యాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గుట్టుచప్పుడు కాకుండా అధికారులు అతన్ని పట్టుకుని జైలుకు తరలించారు.

బెయిల్‌పై విడుదలైన ఖైదీ హల్‌చల్

నంద్యాలలో ఓ కానిస్టేబుల్ హత్య కేసులో కడప సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న వ్యక్తికి శనివారం బెయిల్ మంజూరైంది. కాగా ఇతన్ని మరో కేసులో అరెస్టు చేసేందుకు నంద్యాల పోలీసులు అక్కడికి రావడంతో ఆ వ్యక్తి జైలు ఆవరణలోని నీళ్ల ట్యాంకు పైకి ఎక్కి హల్‌చల్ చేశాడు. దీంతో పోలీసులు, జైలు సిబ్బంది చాకచక్యంగా అతన్ని అదుపులోకి తీసుకుని నంద్యాలకు తరలించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో స్కార్పియో దగ్ధం

చక్రాయపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయ స్వామి ఆలయం సమీపంలో శనివారం వైర్లు షార్ట్‌సర్క్యూట్‌తో ఒక స్కార్పియో దగ్ధమైంది. వివరాల్లోకెళితే.... బద్వేలు నియోజకవర్గం అట్లూరు మండలం పాతఅట్లూరు వాసి మన్నూరు నరసింహులు ఏపీ16బియు0349 స్కార్పియో పూర్తిగా దగ్ధమైంది. సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య చొరవతో దేవస్థాన సిబ్బంది అలర్ట్ అయ్యారు. వేంపల్లె ఫైర్‌స్టేషన్ సిబ్బంది వచ్చి పూర్తిగా మంటలను అదుపు చేశారు. నరసింహులు తన బంధువులతో శనివారం ఉదయం గండికి వచ్చి స్కార్పియోను అర్చకుల క్వార్టర్స్ సమీపాన ఉంచి పాపాఘ్నిలో స్నానమాచరించి అంజన్న దర్శనానికి వెళ్లారు. అంతలో స్కార్పియోకు మంటలు అంటుకున్నారు. వాహనంలో రూ.25వేలు నగదు, పాస్‌బుక్కులు, వివిధ రకాల కార్డులు దగ్ధమైనట్లు బాధితుడు తెలిపారు. పోలీసులు కూడా మంటలను అదుపుచేసేందుకు సహకరించారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

కమలాపురం రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓ హత్య కేసులో తప్పించుకుని తిరుగుతున్న నిందితులను అరెస్టు చేశామని సీఐ రోషన్ తెలిపారు. ఆయన వివరాల మేరకు ఎస్పీ ఆదేశాల మేరకు కడప ఎస్‌డీపీఓ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో కమలాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రోషన్ కమలాపురం ఎస్ఐ ప్రతాప్ రెడ్డి, వల్లూరు పోలీసు సిబ్బంది శనివారం మైదుకూరు టౌన్, ప్రొద్దుటూరు రోడ్డు నుంచి కడపకు వచ్చే బైపాస్‌లో మూలబాట వీధి సర్వీసు రోడ్డు వద్ద మధ్యాహ్నం హత్యకు పాల్పడి పరారీలో ఉన్న వ్యక్తులను పంచాయతీదారుల సమక్షంలో అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు వారు తెలిపారు.

ఎలక్ట్రీషియన్‌పై దాడి - కేసు నమోదు

పుల్లంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరాములపేట వాసి ఎలక్ట్రీషియన్ రమణయ్యపై దళవాయిపల్లె వాసులు ఐదుగురు దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పిచ్చయ్య తెలిపారు. పనికి రావాలని పిలవగా డబ్బు సకాలంలో ఇవ్వరని అన్నందుకు ఇంటికి వచ్చి ఐదుగురు దాడి చేశారన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

గుండెపోటుతో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడి మృతి


రాయుడు (ఫైల్)

రాజంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నాయకుడు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంఎస్ రాయుడు(60) గుండె పోటుతో మృతి చెందారు. శుక్రవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళు తుండ గానే మృతిచెందాడు. శనివారం అంత్యక్రియలు నిర్వహించారు.

ముమ్మరంగా పశుగణన

సిద్దవటం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పశుగణన చేస్తున్నట్లు పశు వైద్యుడు శివశంకర్ తెలిపారు. పెద్దపల్లి గ్రామ పంచాయతీ వెటర్నరీ వైద్యశాలలో శనివారం ఆయన మాట్లాడుతూ పాడి పశువుల పోషకులు ఉదయం వేళల్లో మాత్రమే ఆస్పత్రికి రావాలని, సాయంత్రం గ్రామాల్లో సర్వేలో ఉంటామని తెలిపారు.

మందగిరిలో పూజలు

కడప - చెన్నై జాతీయ రహదారి కనుమలోపల్లె వద్ద వెలసిన మందగిరి శనీశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం శనివారం సందర్భంగా పూజలు తైలాభిషేకాలు చేశారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు.

5న పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాలు

రాయచోటిటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 5న విజయవాడలోని ఎంబీటీకే భవన్‌లో నిర్వహిస్తున్న ఉత్సవాలను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న పిలుపునిచ్చారు. శనివారం మాసాపేటలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. మహబూబ్ బాషా, రెడ్డిప్రసాద్, గణేశ్, శివసాయి, సాజిద్, రవీంద్ర, భాస్కర్, సుబ్రమణ్యం, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్: గీతాంజలి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఆ సంస్థ నాయకులు అర్ధ శతాబ్ది ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు.

తాగునీటి సమస్య పరిష్కారమే ప్రథమ కర్తవ్యం

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


సంబేపల్లె తాగునీటి బోరును ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

గాలివీడు, నవంబరు2(ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని గరుగుపల్లి పంచాయతీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యమన్నారు. ప్రభుత్వం వచ్చిన మొదటి నెలలోనే పింఛన్లను పెంచిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశామన్నారు. రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్యను పరిష్కరించడానికి బోర్లు వేస్తున్నామన్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా నియోజకవర్గంలోని అన్ని మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిందని, తద్వారా రైతులను ఆదుకుంటామని తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో భాగంగా ప్రస్తుతం సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామన్నారు. అనంతరం గ్రామంలో పింఛన్లను పంపిణీ చేశారు. పూజారివాండ్ల పల్లెలో ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను సావధానంగా విని అక్కడికక్కడే పరిష్కరించారు.

రాయచోటిటౌన్: మండల పరిధిలోని కాటిమాయకుంట గ్రామంలో మురుగు కాలువలు, వీధిలైట్లు, రోడ్లు ఏర్పాటు చేయాలని సర్పంచ్ రఘునాథ, డీలర్ వెంకట్రమణ కోరగా వెంటనే సమస్య పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం ఆయన గుంటిమడుగులో ఏర్పాటు చేసిన నీటి పథకం బోరును ప్రారంభించారు.

సంబేపల్లె: రాయచోటి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రక్షిత మంచినీటి పథకాలను మంత్రి ప్రారంభించారు. రెండు, మూడు నెలల్లో మూడు కోట్ల రూపాయలతో 130 బోర్లు వేసినా పూర్తి స్థాయిలో తాగునీటి సమస్య పరిష్కారం కాలేదన్నారు. వెలిగల్లు, ఝరికోన, శ్రీనివాపురం రిజర్వాయర్ ద్వారా శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు. దుద్యాల, పల్లంవాండ్లపల్లె, మోపురంఎల్లిలో తాగునీటి బోర్లను ప్రారంభించారు. అనంతరం కొత్తపురమ్మ ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, పూలుకుంట సర్పంచ్ పార్థ సారథిరెడ్డి, వక్ఫ్‌బోర్డు మాజీ మెంబర్ మహబూబ్‌బాషా, టీడీపీ నాయకులు కోటేశ్వర్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మల్లు నరసారెడ్డి, సుబ్బరాజుయాదవ్, ప్రభాకర్‌నాయుడు, వేణుగోపాల్‌నాయుడు, టీడీపీ నాయకులు రాంమోహన్‌నాయుడు, ఉదయ్‌కుమార్, నాగేశ్వరరావు, రాంమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రహదారుల్లో గుంతలన్నీ తొలగిస్తాం : ఎమ్మెల్యే శ్రీధర్


రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

ఓబులవారిపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గంలోని రహదారులన్నీ అధ్వానంగా మారాయని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. శనివారం మిషన్ పాత్‌హోల్ ఫ్రీ కార్యక్రమంలో భాగంగా ఆయన, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డితో కలసి మండలంలోని కొరకుంట క్రాస్ నుంచి ఎల్లాయపల్లె, కృష్ణంపల్లె, ఉప్పరపల్లె వరకు రూ. 5.50 లక్షల వ్యయంతో తారుతో గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మరికొద్ది రోజుల్లో అన్ని గ్రామాలకు తారు, సిమెంటురోడ్లు నిర్మిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి అధికారులు, జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, జోగినేని మణి, టీడీపీ నాయకులు గునిపాటి రాయుడు, కమతం నాగరాజు, వేణుగోపాల్‌రెడ్డి, గుండయ్యానాయుడు, గ్రామ ప్రజలు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్లకు భూమిపూజ

చిట్వేలి: నగిరిపాడు పంచాయతిలో శనివారం రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి 50 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిమెంటు రోడ్డుకు భూమి పూజ చేశారు. వెంకటరాజుపల్లె, ఉప్పరపల్లె, ఎగువపల్లె, వెంకటరాజుపల్లె హరిజనవాడల్లో సిమెంటు రోడ్లు నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాతంశెట్టి నాగేంద్ర, గుండయ్యానాయుడు, గుత్తి నరసింహ, నానబాల నాగార్జున, కట్టా లోకేష్, రాజా, ప్రదీప్‌రెడ్డి, కొండా వెంకటేశ్, కట్టా బాలాజీ, కూటమి నాయకులు, అధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎవరి కోసం పేదలను వేధిస్తున్నారు

● ప్రశ్నించిన టీడీపీ నేతలు
● తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా


తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

ఒంటిమిట్ట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎవరి స్వలాభం కోసం పేదల ఇళ్లను ఖాళీ చేయిస్తున్నారని టీడీపీ నాయకులు తహసీల్దారు రమణమ్మను ప్రశ్నించారు. ఒంటిమిట్ట చెరువుకు సమీపంలో గృహాలు, దుకాణాలు నిర్మించుకున్న 67 కుటుంబాలకు కొద్ది రోజుల క్రితం రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేయడంతో శనివారం వారంతా స్థానిక కోదండ రామాలయం నుంచి ర్యాలీగా తహసీల్దారు కార్యాలయం చేరుకుని ఆందోళన చేశారు. రోజు కూలితో జీవించే తమను వేధించేందుకే ఈ నోటీసులు జారీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 30 ఏళ్లుగా ఎవరికీ ఇబ్బంది కలిగించకుండా ఇక్కడ జీవిస్తున్న తమకు ఒక్కసారిగా ఇళ్లు ఖాళీ చేయాలని రెవెన్యూ అధికారులు నోటీసులు ఇవ్వడం అన్యాయం అన్నారు. స్థానిక టీడీపీ నాయకులతో కలసి తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎవరి స్వలాభం కోసమో పేదలను ఖాళీ చేయించడం ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుందని, ఈ విషయంపై జిల్లా మంత్రి రాంప్రసాద్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు జగన్ మోహన్ రాజు దృష్టికి తీసుకెళ్లి పేద ప్రజలకు అన్యాయం జరగకుండా న్యాయం చేస్తామని తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకులు కొమరా వెంకటనరసయ్య, అడ్వకేట్ రామదాసు, మావిళ్ల ఈశ్వరయ్య, షేక్ అజ్మత్, నరసింహులు, రామక్రిష్ణ, బాధితులు పాల్గొన్నారు.

అపార్ ఐడీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలి


మాట్లాడుతున్న డీవైఈవో శివప్రకాశ్‌రెడ్డి

రాయచోటిటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలలన్నీ, స్టాండర్డ్ ఫర్ ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్టరీ (అపార్) ఐడీ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని రాయచోటి డీవైఈవో శివప్రకాశ్‌రెడ్డి ఆదేశించారు. శనివారం పట్టణంలోని మార్కెట్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో అపార్ ఐడీ కార్యక్రమంపై పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానో పాధ్యాయులతో పాటు ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ విద్యార్థుల సమాచారాన్ని అపార్ ఐడీలో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు సమాచారం ఇచ్చామన్నారు. ప్రధానోపాధ్యాయులతో పాటు ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు చొరవ తీసుకుని విద్యార్థుల సమాచారాన్ని వేగవంతంగా అపార్ ఐడీలో నమోదు చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించని పాఠశాలలపై చర్యలకు కూడా వెనుకాడమని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-1 బాలాజీ నాయక్, ఎంఈవో-2 వెంకటశివారెడ్డి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ షేక్. అలీ, సీఆర్‌పీలు రవిప్రకాశ్, అరుణ్‌బాబు, శ్రీరాములు, ఈశ్వరమ్మ, ఫర్హానా, ముబారక్ పాల్గొన్నారు.

పంట బీమా ప్రీమియం చెల్లించాలి

లక్కిరెడ్డిపల్లె నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రైతులు పంట బీమా ప్రీమియంను తప్పనిసరిగా చెల్లించాలని జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు మజీద అహ్మద్ సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీవో సభా భవనంలో డివిజన్ పరిధిలోని రామాపురం, లక్కిరెడ్డిపల్లె, వీరబల్లి, గాలివీడు మండలాలకు చెందిన రైతు సేవా కేంద్రం సిబ్బంది, వ్యవసాయ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్ తోపాటు, 2025-26 ఖరీఫ్, రబీ సీజన్లల్లో పంటలు సాగుచేసే రైతులు తప్పకుండా పంటబీమా కోసం ప్రీమియం చెల్లించాలన్నారు. పంటరుణం పొందిన రైతులు బ్యాంక్ రుణం నుంచి ప్రీమియం చెల్లించవచ్చునన్నారు. రుణం తీసుకోని రైతులు మీ సేవ, లేదా గ్రామ సచివాలయం ద్వారా చెల్లించవచ్చున్నారు. ప్రస్తుత రబీ సీజన్‌కు వరి, వేరుశనగ, టమోటా పైర్లకు బీమా వర్తిస్తుందన్నారు. కృషి విజ్ఞాన కేంద్ర అధికారి మానస మాట్లాడుతూ నవంబరు, డిసెంబరు మాసాల్లో మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు పొందవచ్చున్నారు. జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారి రామకృష్ణరాజు మాట్లాడుతూ పంటలకు సోకే తెగుళ్ల, పురుగులను వ్యాప్‌లో నమోదు చేయడంతో పాటు నివారణ చర్యల తీసుకోవాలన్నారు. సాంకేతిక వ్యవసాయ అధికారి రమేష్‌రాజు, లక్కిరెడ్డిపల్లె ఏడీఏ జయరాణి, మండల వ్యవసాయ అధికారులు రమేష్‌బాబురావు, నాగమణి, స్వాతి, వ్యవసాయ సహాయకులు వీరబల్లి నాగరాజు, రైతు సేవాకేంద్ర సిబ్బంది పాల్గొన్నారు

అవినీతి నిర్మూలనకు కృషి చేయాలి

వీరబల్లి, నవంబరు2(ఆంధ్రజ్యోతి): అవినీతి నిర్మూలనకు ప్రతి పౌరుడు కృషి చేయాలని వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి పిలుపునిచ్చారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా నెహ్రూ యువకేంద్రం, వీఆర్‌డీఎస్ సంస్థ సంయుక్తంగా శనివారం స్థానిక ఎస్‌డీకేఆర్ డిగ్రీ కళాశాలలో అవినీతి నిర్మూలనపై అవగాహన కల్పించారు. కళాశాల డైరెక్టర్ రవిశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు నాగయ్య, వెంకటరమణ, శ్రీను, నాగార్జున, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

డీఈవోను కలిసిన వ్యాయామ ఉపాధ్యాయులు

రాయచోటిటౌన్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): డీఈవో సుబ్రమణ్యంను శనివారం అన్నమయ్య జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ వసంత, ఏపీ పీఈటీస్ అండ్ సేఫ్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ మహేష్‌కు అభినందనలు

ఓబులవారిపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అంతర్‌రాష్ట్ర గంజాయి ముఠాను పట్టుకున్న ఓబులవారిపల్లె ఎస్‌ఐ మహేష్‌ను శనివారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డితో పాటు పలువురు అభినందించారు. తప్పించుకుని వెళ్లేందుకు ప్రయత్నించిన ముఠాను పట్టుకునే క్రమంలో కిందపడి ఎస్‌ఐ గాయాలైనా పట్టుదలతో నిందితులను అరెస్ట్ చేయడంతో ఆయనతో పాటు సిబ్బందిని ప్రశంసించారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి గాయాలు

సిద్దవటం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో కిందపడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సిద్దవటం మండలం వెంకటాయపల్లెకు చెందిన పుల్లయ్య శనివారం రాత్రి 9 గంటల సమయంలో బాకరాపేట నుంచి సిద్దవటంకు వస్తుండగా బైక్ అదుపు తప్పి కింద పడింది. దీంతో గాయపడిన అతనిని సిద్దవటం కమ్యూనిటీ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యసేవలు కోసం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.

కరువుతో నష్టపోయిన రైతులను ఆదుకోండి


మాట్లాడుతున్న మండల ఉపాధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి

రామాపురం, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): కరువుతో నష్ట పోయిన రైతులను ఆదుకోవాలని మండల ఉపాధ్యక్షుడు రవిశంకర్ రెడ్డి కోరారు. మండల పరిషత్ సభా భవనంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వాణిజ్య పంటలు సాగు చేసే అవకాశం లేకపోవడంతో మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో ఉలవ పైరు సాగు చేసుకున్నారన్నారు ఎంపీడీవో జాషువా, సర్పంచులు నాగభూషణ్‌రెడ్డి, ముంగర సరోజమ్మ, ఆంజనేయులు, మునీరు, వెంకటరెడ్డి, రామాంజనేయులు, ఎంపీటీసీ సభ్యులు మౌలా, తులసి, మండలంలోని అన్నిశాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు అందించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో జవహర్‌బాబు

గాలివీడు, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలందరికీ సమానంగా అందేలా కృషి చేయాలని ఎంపీడీవో జవహర్ బాబు సూచించారు. శనివారం మండలం సభాభవనంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి, ఎంపీపీ పద్మావతమ్మ, వైసీపీ యదుభూషణ్‌రెడ్డి, తహసీల్దార్ భాగ్యలత, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభ

రామాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఇటీ వల జరిగిన రీసర్వే తో ఏర్పడ్డ భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రామాంజనేయు లు తెలిపారు. మండలంలోని సుద్దమళ్లలో శనివారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ సుద్దమళ్ల గ్రామంలో ఇటీవల కాలంలో 333 3-04 ఎకరాలు సర్వే చేశారన్నారు. ఈఆర్‌ఐ, మండల సర్వేయర్ మధుసూదన్‌రెడ్డి, వీఆర్‌వో, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

20న సాగునీటి సంఘాల ఎన్నికలు

సుండుపల్లె, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): చెరువులు, కుంట లు, ప్రాజెక్టుల అభివృద్ధిలో సాగునీటి సంఘాల పాత్ర ఎంతో కీలకమని ఏఈఈ నాగేంద్ర నాయక్ తెలిపారు. శనివారం మండల కేంద్రం లోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దైవాధీనంతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 20న మండలంలోని యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి పింఛా ప్రాజెక్టు, మడితాడు గ్రామ పంచాయతీలోని కృష్టారెడ్డిచెరువు, సుండుపల్లెలోని గునేటివాగు, తిమ్మసముద్రంలోని ఊటచెరువు, జీ. రెడ్డివారిపల్లెలోని నారాయణరెడ్డి చెరువులకు నీటి సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ గ్రామ పంచాయతీలోని రెవెన్యూ అధికారులు కీలకంగా వ్యవహరించాలని తెలియజేశారు. డిప్యూటీ తహసీల్దార్ రెడ్డెన్న, వీఆర్‌వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు న్యాయవిజ్ఞాన సదస్సు


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి తేజసాయి

పెనగలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కోడూరు జూనియర్ సివిల్ జడ్జి తేజసాయి మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు న్యాయం కోసం 15100 ఉచిత హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఏపీఎం మల్లికార్జునరాజు, పలువురు అధికారులు, న్యాయవాదులు, అంగన్వాడి సభ్యులు, డ్వాక్రా సిబ్బంది పాల్గొన్నారు.

మూఢాచారాలను నమ్మకండి: డీవైఈవో


మూఢనమ్మకాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ, విద్యాశాఖ అధికారులు

సుండుపల్లె, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): క్షుద్ర పూజలు, మూఢాచారాలను నమ్మరాదని రాయచోటి డివిజన్ ఉప విద్యా శాఖ అధికారి శివప్రకాశ్ రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ, మాధురి పాఠశాల, దారుల్ హుదా పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చే శారు. ఈ సందర్భంగా ఆధార్, మార్కులు నమోదు చేయడంపై ఉపాధ్యా యులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. క్షుద్ర పూజలు చేశారని సోషల్ మీడియాలో వచ్చిన ప్రచారంపై విద్యార్థులకు మనోధైర్యాన్ని కల్పించారు. ఎస్‌ఐ శ్రీనివాసులు, మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాయక్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శివశృతి, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచండి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచాలని మండల విద్యాశాఖ అధికారులు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్య సూచించారు. శనివారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌ను సందర్శించి అపార్ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి, అధ్యాపకులు , ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు

నేడు జిల్లాలో ఇన్‌చార్జి మంత్రి పర్యటన

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు2(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పట్టణంలో డీడీఆర్‌సీ సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి జిల్లాలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలకు స్టేట్ గెస్ట్‌హౌస్‌లో అందుబాటులో ఉంటారు. పార్లమెంట్ వ్యాప్తంగా టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

వెంగగురుస్వామి పుష్కరిణి ప్రారంభం


గిరీష్‌రెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన కోనేరు

పెనగలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పి.కొత్తపల్లెలో తలమంచి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తలమంచి గిరీష్‌రెడ్డి నిర్మించిన వెంగగురుస్వామి ఆలయ పుష్కరిణిని శనివారం రాత్రి గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు ఆధ్వర్యంలో ప్రారంభించారు. గ్రామ పురోహితుడు పమిడి కాలువ చెంచు సుబ్బనరసయ్యస్వామి పూజలు నిర్వహించారు. వెంగగురుస్వామికి తెప్పోత్సవం నిర్వహించారు.

విద్యా సామగ్రి వితరణ

సంబేపల్లె, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వెటర్నరీ అసిస్టెంట్ ప్రసన్న కుమార్తె సమన్వి పుట్టినరోజు సందర్భంగా శనివారం సంబేపల్లె ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవోలు రమాదేవి, శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇష్టపడి చదవాలన్నారు. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులు విద్యపై మంచి పట్టు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగేశ్వర రావు, ఉపాధ్యాయులు జయమ్మ, స్కూల్ కమిటీ చైర్మన్ పవన్‌కుమార్‌రాజు, ఎంఆర్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారి కుటుంబానికి ఆర్థిక సాయం

సుండుపల్లె, నవంబరు2(ఆంధ్రజ్యోతి): వేడి పాలు మీద పడడంతో తిమ్మసముద్రం పంచాయతీ మాలపల్లెకు చెందిన మోహన్‌కృష్ణ అనే 17 నెలల చిన్నారి రెండు రోజుల క్రితం గాయపడిన విషయం తెలిసిందే. పేద కుటుంబం కావడంతో ఆ బాలుడి కుటుంబానికి మానవత సభ్యుడు శివకుమార్ నాయుడు రూ.5 వేలు ఇతర సభ్యులు రూ.15 వేలు చొప్పున శనివారం ఆ చిన్నారి తాత రెడ్డెప్ప ఆర్థిక సాయం అందజేశారు.

ఆకాశవాణి.. కడప కేంద్రం!

- ఆరు దశాబ్దాలుగా ప్రసారాల్లో తన మార్కు
- ఉమ్మడి రాష్ట్రంలోనే కడపకు ప్రత్యేక గుర్తింపు
- అన్నివర్గాల కోసం ప్రత్యేక కార్యక్రమాలు
- ఇప్పుడు ఎఫ్ఎంలో కూడా ప్రసారాలు


ఆరు దశాబ్దాలుగా రికార్డయిన వాటి సీడీలు


కడప ఆకాశవాణి కేంద్రంలో ఉన్న సంగీత పరికరాలు



5వ పేజీ తరువాయి

ఇలా ఒకటేంటి బోలెడు ప్రసారాలు అందించేవారు. జిల్లాలో అప్పట్లో జానపదానికి, ఇతర కళాకారులకు కొదవ లేదు. సాహిత్యం, సురభి నాటకాలు ప్రసిద్ధి చెందాయి. కడప కేంద్రం నుంచి పుట్టపర్తి నారాయణాచార్యులు, వినా కపాణి, ఎంఎల్ వసంతకుమార్, పులికంటి క్రిష్ణారెడ్డి, మధురాంతకం రాజారాం, కలువకొలను సదానంద, కేతు విశ్వనాథరెడ్డి, ఆరవేటి శ్రీనివాసులు, సొదుం జయరాం లాంటి ప్రముఖుల ప్రసారాలు ఇచ్చాయి. దివంగత సినీనటుడు గొల్లపూడి మారుతీరావు కడప రేడియో స్టేషన్‌లో పనిచేశారు. మంచి మంచి కార్యక్రమాలు ప్రసారం చేసి కడప స్టేషన్ విశేషంగా ఆకట్టుకుంది. ఇక చిత్రలహరి, చిత్రమంజరి పాటలు వచ్చేవి. ఉదయాన్నే సిగ్నేచర్ ట్యూన్‌తో ప్రారంభమై 5.50గంటలకు ప్రసారాలు మొదలయ్యేవి. సూక్తిరత్నావళి వచ్చేవి. అప్పట్లో ప్రతి ఇంట్లో రేడియో ఉండడంతో సుప్రభాతాలు, విశేషాలు వింటూ మహిళలు ఇంట్లో పనులు చేసుకుంటుండేవారు.

అదే క్రేజీతో ఇప్పుడూ ప్రసారాలు

చాలాకాలంగా దూరదర్శన్ ఉన్నప్పటికీ ఈటీవీ రాకతో ఎంటర్‌టైన్‌మెంట్‌లో మార్పులు వచ్చాయి. అప్పటి దాకా రేడియో ద్వారా వార్తలు, పొలం కబుర్లు, నాటికలు, సినిమా పాటలు, క్రికెట్ కామెంట్లు ఇతర ప్రసారాలు విన్న శ్రోతలు టీవీల రాకతో దానికి కనెక్ట్ అయ్యారు. ఆ తరువాత ఎలక్ట్రానిక్ మీడియా రావడంతో రోజువారి వార్తలు బ్రేకింగ్ పేరిట వచ్చేవి. అయితే ఎన్ని ఉన్నా కూడా రేడియోలో వార్తలు వచ్చాయంటే అది అధికారికంగా కన్‌ఫర్మ్ అయినట్లు. తరవాత కొద్దిరోజులు ఎఫ్ఎం రేడియో వచ్చింది. జాకీల పేరుతో రకరకాల యాంకరింగ్‌తో ఎఫ్ఎంకు కొద్దిరోజులు ఆదరణ పెరిగింది. అవి జనాల్లో ఉన్నాయి. అయితే ఎన్ని వచ్చినా రేడియో రేడియోనే అన్నట్లు దాని క్రేజ్ తగ్గడంలేదు. రేడియోలు నేరుగా కొనకపోయినా కార్లలో రేడియో ఎఫ్ఎంలు, మొబైల్‌లో ఎఫ్ఎంలు, న్యూస్ ఆన్ ఎయిర్ యాప్ మొబైల్‌లో ఉండడంతో ఇక ఈ ప్రసారాలన్నీ యథావిధిగా అందుతున్నాయి. కడప కేంద్రం నుంచి రేడియోతో పాటు ఎఫ్ఎం ద్వారా కూడా ప్రసారం చేస్తున్నారు. ఫోనులైన్ ద్వారా కోరుకున్న పాటలు శ్రోతలకు అందిస్తున్నారు. రేడియో ప్రసారాలు ఇప్పటికీ ఎంతలా ఆదరణ పొందుతున్నాయంటే కడప రేడియో స్టేషన్‌కు ఇప్పటికీ శ్రోతల నుంచి ఇన్‌లాండ్ కవర్లు, పోస్టు కార్డులు పెద్ద సంఖ్యలో రావడం గమనార్హం. ఉత్తరాల్లో శ్రోతలు రాస్తున్న వివరాలను సలహాలు సూచనలు చదివి వినిపిస్తున్నారు.

ప్రసారాలకు డిమాండ్

ఇన్ని మాధ్యమాలు ఉన్నా రేడియోకు క్రేజ్ తగ్గడం లేదు. ఎలాగంటే రేడియో ప్రోగ్రాం కోసం భారీ ఎత్తున ప్రకటనలు రావడం గమనార్హం. కాంతిరేఖలు పేరిట డాక్టర్ల సలహాలు ఇస్తుంటారు. దానికి పెద్దఎత్తున శ్రోతల నుంచి రెస్పాన్స్ వస్తుంది. అర్ధగంట ప్రోగ్రాంకు ఆ సమయంలో వచ్చే అన్ని ఫోన్లకు క్యారీ చేసి సమాధానం చెప్పలేపోతున్నారు. అందుకే ఈ ప్రోగ్రాం కోసం డాక్టర్లు క్యూలో ఉంటుంటారు.

అరుదైన సంపద

కడప రేడియో కేంద్రంలో సంగీతం, సాహిత్యానికి సంబంధించి అరుదైన సంపద ఉంది. ఆరు దశాబ్దాల నాటి సంగీత పరికరాలు, క్యాసెట్లు, సీడీలు ఉన్నాయి. వీటన్నింటికంటే ముఖ్యమైనది.. ప్రముఖుల స్వరం. రేడియో ద్వారా నాలుగైదు దశాబ్దాల ద్వారా కథో, కవితో వినిపించిన నాటి ప్రముఖుల ఆడియోలు ఇప్పటికీ ఇక్కడ భద్రంగా ఉన్నాయి. అప్పుడప్పుడు వారి కథలను పునర్ ప్రసారం చేస్తూ జిల్లా ప్రజలను ఆకాశవాణి అలరిస్తోంది.


విద్యార్థులతో యువవాణి నిర్వహిస్తున్న స్టేషన్ డైరెక్టర్

ప్రసారాలు ఇలా..

రోజూ ఉదయం 5.50కి సిగ్నేచర్ ట్యూన్ మొదలవుతుంది. 5.50కి మంగళధ్వని, దేశభక్తిగీతం, ఆ రోజు ప్రాముఖ్యత బట్టి వివరిస్తారు. 6.05కు న్యూస్, 6.10కి భక్తి రంజని, శుక్రవారం ముస్లింల కోసం ప్రసారం ఉంటుంది. 6.30కి సూక్తిరత్నావళి, 6.35కు పొలం కబుర్లు, 6.45కు ప్రాంతీయ వార్తలు, 7గంటలకు ఆ రోజు ప్రోగ్రాం వివరాలు, 7.05కు జాతీయ వార్తలు హైదరాబాదు నుంచి రిలే, 7.15కు కాంతిరేఖల్లో రాయలసీమ సాహిత్యం, సలహాలు, సైన్స్ టెక్నాలజీ, ఇంటెలిజెన్స్ ఆర్టిఫిషియల్, చరిత్రలో ఈరోజు కూరగాయల ధరలు, శుక్రవారం గాంధీగారి ఆత్మకథ ఉంటాయి. 8.30కు సమాచార భారతి, 8.35కు చిత్ర మంజరి, 9 నుంచి 10గంటల వరకు వాట్సప్ ద్వారా మనోరంజని పాటలు, 10 నుంచి హలో అభిరుచి ఫోన్‌లైవ్ పాటలు ఉంటాయి. 11గంటలకు శాస్త్రీయ సంగీతం, 12.05 నుంచి 12.30 వరకు కర్ణాటక సంగీతం, 1.10 నుంచి 1.20 వరకు పసిడి పంటలు, తెగుళ్లనివారణ సస్యరక్షణకు ఎరువులు, 1.20కి ప్రాంతీయ వార్తలు, 1.30 నుంచి 1.45వరకు మహిళాభారతిలో వంటవార్పు తదితరాలు ఉంటాయి. తరువాత సాయంత్రం 5వరకు బంద్. 5.15కి యువవాణి ప్రోగ్రాం ద్వారా పోటీ పరీక్షల కోసం క్విజ్, అభిప్రాయవేదిక యువతకు సంబంధించిన ప్రోగ్రాంలు ఉంటాయి. 6.30కి పల్లెప్రాంతాలు, రంగస్థలం, చెక్కభజన, ఫోక్‌సాంగ్స్, 6.50కి వ్యవసాయ సూచనలు, 7.15 నుంచి 7.45 వరకు పంటసీమలు, మార్కెట్‌ధరలు తదితరాలు, 7.45 నుంచి చిత్రలహరి ఉంటుంది. తరువాత ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, ఇంటర్వ్యూలు ఉంటాయి. 9గంటలకు న్యూస్ అట్ నైన్, జాతీయ స్థాయిలో జరిగిన వార్తల వివరాలు, 9.16కు స్పాట్‌లైట్ అంటే జాతీయ వ్యాప్తంగా ఆ రోజు వార్తలు, 10 నుంచి 11 వరకు శాస్త్రీయ సంగీతం ఉంటుంది.


40 ఏళ్లనాటి రేడియో కం టేప్ రికార్డర్

అప్రమత్తంగా ఉండండి..

- చిరుతపులి సంచారంపై గ్రామాల్లో దండోరా


చిరుత సంచారంపై దండోరా వేయిస్తున్న ఎఫ్‌బీవో దీప

నిమ్మనపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టూరు పంచాయతీ చల్లావారిపల్లి సమీపంలో బోడికొండ వద్ద దూడను చిరుతపులి చంపిన విషయం తెలిసిందే. అయితే శనివారం అటవీశాఖ అధికారి ఎఫ్‌బీవో దీప సమీప గ్రామాలలో పర్యటించి చిరుతపులి సంచారంపై దండోరా వేయించారు. ఆమె మాట్లాడుతూ చల్లావారిపల్లి సమీపంలో అటవీ ప్రాంతం ఉండడంతో రెండు రోజులుగా చిరుతపులి సంచరిస్తున్నట్లు తెలిపారు. పొలాల వద్దకు వెళ్లే రైతులు తగిన జాగ్రత్తలు వహించాలన్నారు. అయితే చిరుతపులి హాని చేస్తుందని సంహరించేందుకు కరెంటు వైర్లు తీయడం, మందులు పెట్టడం వంటివి చేయరాదని తెలిపారు. చిరుత కనిపించిన వెంటనే అటవీశాఖ అధికారులకు తెలియజేయాలని తెలిపారు. ప్రజలు రాత్రి సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని దండోరా వేయించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కురబలకోట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు మందలించారని యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన శనివారం మండలంలో జరిగింది. దీనికి సంబంధించి స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పిచ్చలవాండ్లపల్లెకు చెందిన రెడ్డికిరణ్‌రెడ్డి (23) డిగ్రీ వరకు చదువుకుని ఇంటి వద్దనే ఉన్నాడు. కాగా ఇతను జల్సాలు, బెట్టింగ్‌కు అలవాటు పడి పలువురి దగ్గర వద్ద అప్పులు చేశాడు. గతంలో ఇతను చేసిన అప్పులను తల్లిదండ్రులు తీర్చారు. ఈ నేపధ్యంలో మళ్లీ తల్లిదండ్రులు కొనిచ్చిన ద్విచక్రవాహనాన్ని తాకట్టు పెట్టి రూ.50 వేలు అప్పు చేసి బెట్టింగ్‌కు పాల్పడి డబ్బులు పోగొట్టుకున్నాడు. ఈ విషయాన్ని పలువురు అతడి తల్లిదండ్రుల దృష్టికి తీసుకురావడంతో అతన్ని మందలించడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు చికిత్సల నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు సమాచారాన్ని ఆసుపత్రి ఔట్‌పోస్టు సిబ్బంది ముదివేడు పోలీసులకు అందించారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

కలికిరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టపాళెం పంచాయతీ కుమ్మరపల్లె వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను డ్రైవరు అజాగ్రత్తగా నడపడంతో మోటారు సైకిల్‌పై వెళుతున్న యువకులు తీవ్ర ప్రమాదానికి గురయ్యారు. పోలీసు ఇన్‌స్పెక్టర్ కె.రెడ్డిశేఖర్‌రెడ్డి ఆదేశాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్న హెడ్ కానిస్టేబుల్ కొండప్ప తెలిపిన వివరాల ప్రకారం.. వాల్మీకిపురం మండలం గండబోయనపల్లె పంచాయతీ మేకలవారిపల్లెకు చెందిన యువకులు ప్రభాకర్ (23), గణేష్ (20), మనోహర్ (19)లు కలికిరి నుంచి ద్విచక్ర వాహనంలో రాత్రి 7 గంటల సమయంలో స్వగ్రామం వెళుతుండగా కుమ్మరపల్లె వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ మోటారు బైక్‌ను ఢీకొంది. డ్రైవర్ అజాగ్రత్తగా ట్రాక్టర్ నడపడంతో దానికున్న రోటావేటర్ కారణంగా ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో ప్రభాకర్ కాలు మోకాలి వరకూ తెగిపడింది. మిగతా ఇద్దరికి కూడా బలమైన గాయాలు తగిలాయి. ప్రభాకర్‌ను వెంటనే వేలూరు సీఎంసీకి తరలించారు. మిగతా ఇద్దరినీ తిరుపతి ఆసుపత్రికి పంపారు. ఇందులో ప్రభాకర్ ఇంజనీరింగ్ పట్టభద్రుడు కాగా మిగతా ఇద్దరు స్థానిక కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు. ప్రభాకర్ తల్లి మేకల వసంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

15న అరుణాచలంకు రెండు ఆర్టీసీ బస్సులు

మదనపల్లె అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈనెల 15వ తేదీ గిరి ప్రదక్షిణకు మదనపల్లె ఆర్టీసీ వన్ డిపో నుంచి రెండు అల్ట్రా డీలక్స్ బస్సులు నడుపుతున్నట్లు ఆ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులు బయలుదేరుతాయని చెప్పారు. ఒక్కరికి రానుపోను టికెటు ధర రూ.805గా నిర్ణయించినట్లు తెలిపారు. అరుణాచలం వెళ్లే భక్తులు టికెట్లు రిజర్వేషన్ చేయించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు, బుకింగ్ కోసం డిపో మేనేజరు 9959225676, 7382875034, 9440858510కు సంప్రదించాలన్నారు.

10లోపు అభ్యంతరాలు తెలియచేయాలి

మదనపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు పాలకవర్గానికి జరగబోయే ఎన్నికలకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 10వ తేదీ లోపు లిఖితపూర్వకంగా తెలియచేయాలని మదనపల్లె కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు సీఈవో పీవీ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మదనపల్లె కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు పాలకవర్గానికి ఈనెల 28న ఎన్నికలు జరుగుతాయని, ఇందుకు సంబంధించిన ఓటరు లిస్టు (ఏ-క్లాసు మెంబర్ల లిస్టు)ను బ్యాంకు నోటీసు బోర్డులో ప్రకటించినట్లు తెలిపారు. దీనిపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 10వ తేదీ లోపు బ్యాంకు సీఈవోకు రాతపూర్వకంగా తెలియచేయాలని తెలిపారు. 11న తుది ఓటరు జాబితాను ప్రకటిస్తారన్నారు. గుర్తింపు కార్డు లేని ఏ-క్లాసు మెంబర్లు వెంటనే రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీని బ్యాంకులో అందచేసి గుర్తింపు కార్డు పొందాలని పేర్కొన్నారు.

ఇచ్చేది గోరంత.. లాక్కునేది కొండంత

- ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ధ్వజం

వేంపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇస్తున్నది గోరంత... లాక్కుంటున్నది కొండంత అని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం ఆయన వేంపల్లెలో విలేకరులతో మాట్లాడుతూ ఉచిత గ్యాస్ పథకం పేరుతో ప్రభుత్వం ఏడాదికి ప్రజలకు ఇస్తున్నది రూ.2,684 కోట్లు, కరెంటు సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజల నుంచి లాక్కుంటున్నది రూ.6,073 కోట్లు అన్నారు. ఇదికాక మరొకసారి సర్దుబాటు చార్జీల పేరుతో రూ.11,826 కోట్లు అదనపు భారం మోపబోతోందన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం ఉచిత గ్యాస్ పథకం అమలు కావడం లేదన్నారు. ప్రతి ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తామని మేనిఫెస్టోలో చెప్పారన్నారు. రాష్ట్రంలో 180 లక్షల కుటుంబాలు ఉన్నాయన్నారు. అందులో 154 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. 154 లక్షల గ్యాస్ కనెక్షన్లకు ఉచిత గ్యాస్ ఇవ్వాలంటే ఏడాదికి రూ.4,000 కోట్లు కావాలి, కానీ ప్రభుత్వం రూ.2,684కోట్లు మాత్రమే ఇస్తోందన్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

- సుమో, ఒక కారుతో సహా 50 కేజీల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న నలుగురు అంతర్‌రాష్ట్ర స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. శనివారం రాయచోటిలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిందితుల వివరాలను ఎస్పీ మీడియాకు వెల్లడించారు. రాజంపేట డీఎస్పీ సుధాకర్ ఆధ్వర్యంలో రైల్వేకోడూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వర్లు, అర్బన్ ఇన్‌స్పెక్టర్ హేమసుందర్‌రావు, రాజంపేట రూరల్ ఇన్‌స్పెక్టర్ బీవీ రమణ, ఓబులవారిపల్లె తహసీల్దార్ శ్రీధర్‌రావు, ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్ సిబ్బందితో కలిసి మంగంపేట సమీపంలోని చెన్నకేశవగుడి సమీపంలో జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక సుమో, ఒక కారులో ముగ్గురు మగవారు, ఒక మహిళ సుమారు 10 లక్షల విలువ చేసే 50 కేజీల గంజాయిని తిరుపతికి తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు తెలిపారు.

నాలుగు ఎర్రచందనం కేసులు, నాలుగు గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్న పుల్లంపేట మండలం రంగంపల్లికి చెందిన కల్లపల్లి నాగేంద్ర, అతడితో సహజీవనం చేస్తూ తిరుపతి పట్టణం గాంధీనగర్‌కు చెందిన అన్నామలై ఆచారి భార్య కుమారి, కేరళ రాష్ట్రానికి చెందిన రెండు గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్న బాపురాజన్‌శ్రీని, చిత్తూరు జిల్లా పలమనేరు మండలం కాకతోపు వీధికి చెందిన షేక్ సలీంబాషాలు అరెస్టయిన వారిలో ఉన్నారన్నారు. ఈ గంజాయి అక్రమ రవాణా, విక్రయాల్లో వీరితో పాటు మరికొంతమంది ప్రమేయం ఉందని తెలిపారు.

వీరిపై ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పెట్టనున్నట్లు ఎస్పీ తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి అక్రమ రవాణా విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, అక్రమ రవాణా చేసినా, అందుకు సహకరించినా వారిపై నాన్ బెయిలబుల్ కేసులు పెడతామని ఎస్పీ హెచ్చరించారు. అలాగే గంజాయి అక్రమ రవాణా కేసుల్లో ఎక్కువ సార్లు దొరికిన వారిపై పీడీ యాక్టు అమలు చేస్తామన్నారు. గంజాయి అక్రమ రవాణా కేసులో ముద్దాయిలను అరెస్టు చేయడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. గంజాయి కేసులో ముద్దాయిలను పట్టుకోవడంలో భాగంగా ప్రమాదవశాత్తు ఓబులవారిపల్లె ఎస్ఐ మహేశ్‌నాయుడు కిందపడి చేతికి గాయాలైనప్పటికీ లెక్కచేయకుండా నిందితులను అరెస్టు చేసినందుకు ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

యువతకు భరోసా కల్పించిన నారా లోకేశ్ అమెరికా పర్యటన

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేమన సతీశ్


అమెరికాలో నారా లోకేశ్‌తో వేమన సతీశ్

రాజంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రగతికి యువత భవితకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటన ఎంతో ఉపయోగపడిందని తానా మాజీ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేమన సతీశ్ తెలిపారు. మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటన ఆద్యంతం తాను నారా లోకేశ్‌తో గడిపానని అన్నారు. నారా లోకేశ్‌తో పాటు అమెరికా పర్యటనలో పాల్గొని ఆయనతో పాటు తిరిగు ప్రయాణం సందర్భంగా వేమన సతీశ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణం తీరిక లేకుండా అమెరికాలో పలు ప్రఖ్యాత కంపెనీలతో సుదీర్ఘ చర్చలు జరిపి రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన అవకాశాలు వివరిస్తూ ఆయన చేసిన ప్రసంగం అక్కడి పారిశ్రామికవేత్తలను ఆకట్టుకుందన్నారు. ఆయన అమెరికా పర్యటన వల్ల ఎన్నో పరిశ్రమలు రాష్ట్రానికి రానున్నాయని తెలిపారు.

పాత సామాన్లు అమ్ముతాం

- ధరలు మాత్రం తగ్గించం
- ఎక్సైజ్ శాఖ వింత నిర్ణయం


మదనపల్లె ఏపీఎస్‌బీసీఎల్ డిపోలో భద్రపరచిన పాత ఫ్రీజర్లు, బ్యాటరీలు

మదనపల్లె టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా.. ఏవైనా వస్తువులు కొనుగోలు చేసి వాటిని ఐదేళ్ల పాటు ఉపయోగించాక, వాటిని తిరిగి అమ్మాలంటే తరుగు (డిప్రిసియేషన్) తీసేసి విక్రయిస్తారు. ద్రవ్యోల్బణం సూత్రం ప్రకారం వస్తువులు వాడిన ఏడాదికి ఎంత లేదన్నా కొనుగోలు ధరలో 10 శాతం తీసివేసి అమ్మడం చూస్తుంటాం. కానీ రాష్ట్ర అబ్కారీ శాఖ మాత్రం ఐదేళ్ల పాటు ఉపయోగించిన వస్తువులను బుక్‌వాల్యూ ధర కన్నా అదనంగా విక్రయించాలని ఉత్తర్వులు జారీ చేసింది. అదీకాక ఆ వస్తువులను బహిరంగ వేలంలో విక్రయించడంతో పాటు, వచ్చిన ధరకు అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొనడం చూస్తే ఇదెంత వింత నిర్ణయమో చూసే వారిని విస్మయం కలిగించకమానదు.

జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో 109 ప్రభుత్వ మద్యం దుకాణాలు నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక నూతన ఎక్సైజ్ పాలసీ విధానం తీసుకొచ్చి ప్రభుత్వ మద్యం దుకాణాలను ఎత్తివేసింది. ఈ క్రమంలో జిల్లాలోని ఎనిమిది ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలోని 109 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో వినియోగించిన ఫ్రీజర్లు, ఇన్వర్టర్లు, బ్యాటరీలు, లేబుల్ స్కానర్లు, క్యాష్ కౌంటింగ్ మిషన్లు, క్యాష్ చెస్ట్‌లు అన్నింటిని కలిపి ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకుని మదనపల్లె, కడప ఏపీఎస్‌బీసీఎల్ డిపోలకు తరలించారు. వీటితో పాటు గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మిగిలిపోయిన మద్యంను కూడా డిపోలకు తరలించారు.

వేలంలో కొనుగోలు చేయండి

రాష్ట్రంలోని ప్రభుత్వం మద్యం దుకాణాల్లో స్వాధీనం చేసుకున్న పాత సామాన్లను బహిరంగ వేలంలో విక్రయించాలని ఎక్సైజ్‌శాఖ (ఏపీఎస్‌బీసీఎల్) బోర్డు డైరెక్టర్లు గత నెల 23వ తేదీ సమావేశమై తీర్మానించారు. ఈ మేరకు ఏపీఎస్‌బీసీఎల్ ఎండీ రాష్ట్రంలోని అన్ని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్లకు, ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్లకు ఉత్తర్వులను పంపారు. అంతా సక్రమంగా ఉంటే ఇందులో పెద్ద వింతేమి లేదు..కానీ ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి స్వాధీనం చేసుకున్న ఫ్రీజర్లు, ఇన్వర్టర్లు, బ్యాటరీలు, లేబుల్ స్కానర్లు, క్యాష్ కౌంటింగ్ మిషన్లు, క్యాష్ చెస్ట్‌లకు బుక్ వాల్యూ నిర్ణయించారు. ఈ ధరల కన్నా 20 శాతం అప్‌సెట్ ధరలు నిర్ణయించి బహిరంగ వేలం నిర్వహించి హెచ్చు పాటదారుడికి విక్రయించాలని ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవంగా హారిజాంటల్ ఫ్రీజర్ (బీర్లు కూలింగ్ చేసేవి) 1000 లీటర్ల సామర్థ్యం ఉండేవి మార్కెట్‌లో రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ధరలు ఉన్నాయి. ఐదేళ్ల పాటు ఈ ఫ్రీజర్లు ఉపయోగించిన దరిమిలా వీటి డిప్రిసియేషన్ ఎంత లేదన్నా ఏడాదికి రూ.3 వేలు చొప్పున ఐదేళ్లకు రూ.15 వేలు తీసివేయాల్సి ఉంది. అంటే ఉపయోగం (ఆపరేటింగ్‌లో) ఉన్న ఫ్రీజర్ ధరలు గరిష్ఠంగా రూ.10 నుంచి రూ.15 వేల వరకు వెచ్చించి తీసుకోవచ్చని ఫ్రిజ్ మెకానిక్‌లు చెబుతున్నారు. అవే ఫ్రీజర్లో అమ్మోనియం గ్యాస్ లీకేజి అయిపోయి, మరమ్మతులకు గురైన ఫ్రీజర్లను రూ.5 వేల వరకు కొనుగోలు చేయవచ్చని మెకానిక్‌లు చెబుతున్నారు. కానీ వాస్తవంగా ఎక్సైజ్‌శాఖ అధికారులు నిర్ణయించిన ధరల ప్రకారం ఫ్రీజర్ ధర బుక్ వ్యాల్యూ ప్రకారం రూ.18,900 ఉండగా, అప్‌సెట్ ధరను 20 శాతం పెంచి రూ.22,680గా నిర్ణయించారు. ఈ ధరను అప్‌సెట్ ధరగా (సర్కారు పాట) పెట్టి బహిరంగ వేలం నిర్వహించి హెచ్చుపాటదారుడు ఎవరైనా ఉంటే వారికి ఫ్రీజర్‌ను అప్పగిస్తారు. అంతేకాదు సుమా ఈ పాటదారుడు పాడిన ధరకు అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంది. ఇదే కోవలో ఇన్వర్టర్లు, బ్యాటరీలు, లేబుల్ స్కానర్లు (అన్నీ ఎలక్ట్రానిక్ వస్తువులే) ధరలు కూడా బుక్ వ్యాల్యూకి 20 శాతం అదనంగా అప్‌సెట్ ధరలు నిర్ణయించారు. అసలే ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆపై ఐదేళ్ల పాటు వాడి పడేశారు. వీటి ప్రస్తుత ధరలు మార్కెట్‌లో ఏ సామాన్యుడిని అడిగినా టక్కున ఎంతకు కొనుగోలు చేయవచ్చో ఇట్టే చెప్పేస్తారు. అలాంటి ఫ్రీజర్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను ఎక్కువ ధరలకు బహిరంగ వేలంలో విక్రయించాలని ఎక్సైజ్‌శాఖ అధికారులు తీసుకున్న వింత నిర్ణయంతో ఈనెల 7వ తేదీ కడప, మదనపల్లె ఏపీఎస్‌బీసీఎల్ డిపోల్లో నిర్వహించే పాత సామాన్ల బహిరంగ వేలంలో ఈ పాత సామానులు అమ్ముడుపోతాయా..? అన్నదే వెయ్యి డాలర్ల ప్రశ్నగా మారనుంది.

పారదర్శకంగా ఎక్సైజ్ వస్తువుల వేలం

- డిపో మేనేజర్ శ్రీనివాసులు


మాట్లాడుతున్న ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్

మదనపల్లె ఎక్సైజ్ డిపో పరిధిలో స్వాధీనం చేసుకున్న వస్తువులను పారదర్శకంగా వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ డిపో మేనేజర్ వి.శ్రీనివాసులు తెలిపారు. శనివారం పుంగనూరు రోడ్డులోని ఏపీఎస్‌బీసీఎల్ డిపోలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపో పరిధిలోని 69 ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి స్వాధీనం చేసుకున్న ఫ్రీజర్లు, ఇన్వర్టర్ బ్యాటరీలు, స్కానర్లు, క్యాష్ కౌంటింగ్ మిషన్లు, క్యాష్ చెస్ట్‌లను డిపోలో భద్రపరిచామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ వస్తువులను ఈనెల 7వ తేదీ డిపో ఆవరణంలో బహిరంగ వేలం వేస్తామన్నారు.

ఆసక్తి గల వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. హెచ్చుపాటదారుడికి ఆయా వస్తువులను అప్పగిస్తామన్నారు. అలాగే డిస్టిలరీల నుంచి వచ్చే స్టాకు ఆధారంగా డిపో పరిధిలోని 69 ప్రైవేటు మద్యం దుకాణాలను విభజించి, రేషన్ ప్రకారం సరఫరా చేస్తున్నామన్నారు. వేలం పాట నిర్వహణ వివరాల కోసం స్టోర్ మేనేజర్ 9701777938, 8639494220, 9866144462 నెంబర్లకు ఫోన్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఆదికేశవులు, సీఐ ప్రశాంత్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వం ఏదైనా మేం చెప్పేదే జరగాలి, మేం వచ్చేదే సమయం. అధికారులు ఎవరు వచ్చినా మాకోసం నిరీక్షించాల్సిందే. ఉమ్మడి జిల్లా అధికారులు అన్ని పనులను వదులుకుని జిల్లా, డివిజన్, అధికారులు సమావేశానికి వస్తుంటారు. అయినా వైసీపీ అధీనంలోని జడ్పీ పాలకమండలి సభ్యులు (జడ్పీటీసీలు) స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని మరిచి చైర్‌పర్సన్ చాంబర్‌లో ముచ్చట్లలో మునిగిపోయారు. జడ్పీ సీఈఓ ఓబులమ్మ కూడా చైర్‌పర్సన్ చాంబర్‌కు వెళ్లి నేను సైతం అంటూ వారితో మమేకమయ్యారు. ఆయా శాఖల జిల్లా అధికారులను 45 నిమిషాలు నిరీక్షింప చేయడంతో వారు తీవ్ర అసహనానికి లోనయ్యారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో ఇలాంటి నిరీక్షణ సహజమేనని టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కూడా కొనసాగుతుండడంపై అధికారులు అవాక్కవుతున్నారు. అధికారి స్థాయి ఏదైనా తప్పదన్నట్లు వేచిచూడాల్సిందే అన్నట్లుగా జరిగింది. వివరాల్లోకెళితే...

మేం వచ్చేదే సమయం

- స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని పట్టించుకోని వైసీపీ పాలకమండలి
- చైర్‌పర్సన్ చాంబర్‌లో మాటా మంతీ
- నేను సైతం అన్న సీఈఓ
- అసహనానికి లోనైన అధికారులు
- రెండు గంటలకే మమ...!
- నవ్విపోదురుగాక మాకేంటి




జడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శారద, సీఈఓ ఓబులమ్మ తదితరులు - వైసీపీ పాలక వర్గం కోసం ఎదురు చూస్తున్న అధికారులు

కడప రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సమావేశహాలులో శనివారం నిర్వహించిన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం నవ్విపోదురుగాక మాకేంటి అన్నట్లుగా కొనసాగింది. ఉదయం 10 గంటలకు ప్రారంభించాల్సిన సమావేశాలను 45 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభించారు. (ఉమ్మడి కడప జిల్లా) కడప, అన్నమయ్య జిల్లాల నుంచి దాదాపు 30 శాఖల అధికారులు నిర్వాహకులు నిర్దేశించిన సమయానికి హాజరయ్యారు. వైసీపీ అధీనంలోని జడ్పీ పాలకమండలి (జడ్పీటీసీలు) చైర్‌పర్సన్ చాంబర్‌లో ముచ్చట్లలో మునిగిపోయారు. జడ్పీ సీఈఓ ఓబులమ్మ కూడా వారితో మమేకమయ్యారు. సమావేశ నిర్వాహకులు తమ బాధ్యతను పక్కనపెట్టి వైసీపీ పాలకమండలి చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండడంతోనే సమావేశాలు ఆలస్యంగా కొనసాగుతున్నాయన్న విమర్శలు చక్కర్లు కొడుతున్నాయి. చివరికి ఓ అధికారి చైర్‌పర్సన్ చాంబర్‌కువెళ్లి 10-45 నిమిషాలు కావస్తోంది అధికారులు నిరీక్షిస్తున్నారని చెబితే సమావేశం ప్రారంభించారు.

ప్రేక్షక పాత్రలో కమిటీల చైర్మెన్లు

స్థాయీ సంఘాల కమిటీల సమావేశంలో ఆయా కమిటీల చైర్మెన్‌లు ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారు. జడ్పీ చైర్‌పర్సన్ జె. శారద ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణ అభివృద్ధి, విద్య, వైద్య సేవల, పనుల, మహిళా సంక్షేమం స్థాయీ సంఘాలకు చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. కానీ ఆయా సంఘాల సమీక్షల్లో జడ్పీ చైర్‌పర్సన్ ఒక్క మాటకూడా మాట్లాడకుండా ఉత్సవ విగ్రహంలా ప్రేక్షక పాత్రవహించారు. సాంఘిక సంక్షేమం స్థాయీ సంఘానికి చిట్వేలి జడ్పీటీసీ పుష్పలత చైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఈమె కూడా తమ కమిటీ చర్చలో ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారు. వ్యవసాయం స్థాయీ సంఘానికి పిట్టు బాలయ్య(జడ్పీ రెండో చైర్మెన్) చైర్మెన్‌గా ఉన్నారు. ఈయన మాత్రం వ్యవసాయ, అనుబంధశాఖల చర్చలో ఒకటి, రెండు పసలేని ప్రశ్నలను సంధించి వారికంటే ఈయనే నయమనిపించారు.

అంతా గందరగోళం

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలను నిర్వాహకులు గందరగోళంగా నిర్వహించారు. కమిటీలోని ఆయాశాఖల అధికారుల సమీక్ష జరుగుతుండగానే మరో కమిటీశాఖలపై సభ్యులు ప్రశ్నలను సంధించారు. దీంతో ఏ అధికారి ఏ సమాధానం చెప్పాలో అర్థం కాక గడిబిడ ఏర్పడింది. ఒక రకంగా చెప్పాలంటే క్రమశిక్షణ ఉల్లఘించారనే అపవాదు నెలకొంది. గ్రామీణ అభివృద్ధి స్థాయీ సంఘం సమావేశం పరిధిలోని ఆయా శాఖల అధికారులు వేదికపైకి వచ్చి సమాధానాలు వినిపిస్తుండగానే వ్యవసాయ స్థాయీ సంఘం ఉద్యానశాఖ సభ్యులు ప్రశ్నలు అడిగారు. దీంతో ఎవరు, ఎవరికి ఏ సమాధానం చెప్పాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది.

అరకొరగా సమస్యలపై చర్చ

జడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో ఆయా శాఖల సమీక్షను అరకొరగా చర్చసాగించారు. మొత్తం ఏడు స్థాయీ సంఘాల్లో మూడు, నాలుగు మాత్రమే చర్చించి మిగిలిన వాటిని మడతపెట్టేశారు. ప్రణాళిక, ఆర్థికస్థాయీ సంఘ పరిధిలో ముఖ్యమైన శాఖలను వదిలి పీఆర్ ఇంజనీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, మైన్స్, శాఖలను మాత్రమే చర్చించి వదిలేశారు. గ్రామీణ అభివృద్ధి సంఘంలో మొత్తం ఏడు శాఖల్లో డీఆర్‌డీఏ, డ్వామాపై మాత్రమే చర్చించారు. విద్య, వైద్యసేవల స్థాయీ సంఘంలో మొత్తం 9 శాఖల్లో డీఎంఅండ్‌హెచ్ఓ, డీఈఓ శాఖలపై మాత్రమే అరకొరగా చర్చించారు. వ్యవసాయ స్థాయీ సంఘంలో మొత్తం 12 శాఖల్లో కేవలం వ్యవసాయశాఖ, ఉద్యానశాఖలపైనే బరువుబరువుగా చర్చించి చేతులు దులిపేసుకున్నారు.

మొక్కుబడి సమావేశాలు

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలను మొక్కుబడిగా నిర్వహించారు. గతంలో ఆయా స్టాండింగ్ కమిటీ సమావేశాలను ఆయా కమిటీల చైర్మెన్‌ల ఆధ్వర్యంలో ఒక్కొక్కటిగా నిర్వహించేవారు. ఈసారి మూకుమ్మడిగా అన్ని కమిటీల సమావేశాలను నిర్వహించారు. దీంతో ఒక కమిటీలోని సభ్యులు మరో కమిటీ ప్రశ్నలను లేవనెత్తి గందరగోళానికి నాందిపలికారు.

రెండు గంటలకే మమ

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వాహకులు రెండుగంటలకే మమ అనిపించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభించాల్సిన సమావేశాన్ని 10:45 గంటలకు ప్రారంభించి 1 గంటకు ముగించి ఓ పనైపోయిందనిపించారు.

పేలవంగా సమావేశం

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని పేలవంగా నిర్వహించారు. ఆయా శాఖల అధికారులతో సంఘ సభ్యులు(జడ్పీటీసీలు) శాఖల పనితీరు, సంక్షేమ పథకాలపై అరొకొరగా పసలేని చర్చ కొనసాగించారు. జడ్పీ వైస్ చైర్మెన్ పిట్టు బాలయ్య యాదవ్, కో-ఆప్షన్ సభ్యులు అచ్చుకట్ల కరీముల్లా, పోరుమామిళ్ల జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వేంపల్లె జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, రామాపురం జడ్పీటీసీ వెంకటరమణ, బి.కోడూరు జడ్పీటీసీ దావీదు, కమలాపురం జడ్పీటీసీ ఎల్. సుమిత్రా తదితరులు పలు మండలాల్లో అసమతుల్య వర్షాల కారణంగా ఖరీఫ్ పంటలు ఎండి రైతులు అల్లాడుతున్నారని, ఆయా మండలాలను కరువు మండలాలుగా గుర్తించడంలో వ్యవసాయశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో వైఎస్ఆర్ జలకళ ద్వారా వేసిన బోర్లకు మోటార్లను అమర్చలేదని పైగా విద్యుత్ సరఫరా ఇంతవరకు ఇవ్వకపోవడం దారుణమని పోరుమామిళ్ల జడ్పీటీసీ చెన్నయ్య అడిగారు. జిల్లాలోని ఆయా షాదిఖానాల ద్వారా వచ్చే ఆదాయం ఏ ఖాతాలో జమ అవుతుందో తెలియడంలేదని వాటి వివరాలను తెలపాలని పలు సమావేశాల నుంచి కోరుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని కో-ఆప్షన్ సభ్యులు ఎ. కరీముల్లా మండిపడ్డారు. ఆర్‌బీకేల నిర్మాణాలకు బిల్లులు సక్రమంగా రావడంలేదని వాటిని వెంటనే చెల్లించాలని, కడప - పులివెందుల మార్గంలోని ఎల్లటూరు వద్ద రోడ్డుపై వర్షపు నీరు నిలబడడంతో రోడ్డు అధ్వాన్నంగా ఉందని వీటి పనులను ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే చేపట్టాలని జడ్పీ వైస్‌చైర్మన్ బాలయ్య పేర్కొన్నారు. పోరుమామిళ్ల మండలంలో నాడు-నేడు పథకం ద్వారా చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయని వాటిని పూర్తిచేయాలని జడ్పీటీసీ చెన్నయ్య తెలిపారు. అభివృద్ధి పనులకు జడ్పీటీసీల నుంచి కూడా ప్రతిపాదనలు తీసుకోవాలని, మండల స్థాయిలోని హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీలో సభ్యులుగా ఉంచాలని వేంపల్లె జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, జడ్పీ వైస్‌చైర్మెన్ బాలయ్య యాదవ్ కోరారు. సమావేశాల్లో డిప్యూటీ సీఈఓ మైథిలి, ఆయా శాఖల జిల్లా అధికారులు, జడ్పీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి



రక్తపు మడుగులో పడివున్న ప్రవీణ్ మృతదేహం

సిద్దవటం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కడప - చెన్నై జాతీయ రహదారిపై జేఎంజే కాలేజ్ కోతులు తూము వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రవీణ్(19) అక్కడికక్కడే మృతి చెందగా రోహిత్ కుమార్(20) చికిత్స పొందుతూ మృతి చెందారు. వివరాల్లోకెళితే.... అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం ఇసుకపల్లె యువకులు ప్రవీణ్, రోహిత్‌కుమార్ కడప నుంచి రాజంపేటకు బైక్‌లో వెళుతుండగా తిరుపతి నుంచి కడపకు వస్తున్న పులివెందుల డిపో ఆర్టీసీ బస్సు జేఎంజే కాలేజీ వద్ద బైక్‌ను ఢీకొంది. దీంతో ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రగాయాలపాలైన రోహిత్‌ను వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రోహిత్ మృతి చెందాడు. సిద్దవటం పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీసుల అదుపులో చైన్ స్నాచర్



షేక్ ఆజాం అలి అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ

మైదుకూరు రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో చైన్ లాక్కెళ్లిన షేక్ ఆజాం అలి సేట్‌ను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్పీ రాజేంద్రప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ మైదుకూరులో దసరా వేడుకల్లో అమ్మవారిశాల వద్ద నిలబడి ఉన్న మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లిన నిందితుడిని సీఐ హసం, ఎస్ఐ మద్దిలేటి ముమ్మరంగా గాలించారు. కడప పట్టణం మోచంపేటకు చెందిన షేక్ ఆజాం అలి సేట్‌ని మైదుకూరు బైపాస్ వద్ద అదుపులోకి తీసుకుని విచారించగా ఇతనిపై మైదుకూరు, ప్రొద్దుటూరు, మన్నూరు పోలీస్‌స్టేషన్లలో మూడు చైన్ స్నాచింగ్ కేసులు, మైదుకూరులో మోటార్ సైకిల్ చోరీ కేసు ఉన్నట్లు తేలినట్లు డీఎస్పీ తెలిపారు. ఇతని నుంచి రెండు మోటార్‌సైకిళ్లు, 70.5 గ్రాముల బరువు గల నాలుగు బంగారు చైన్‌లు స్వాధీనం చేసుకున్నారు. షేక్ ఆజాం అలిని పట్టుకోవడానికి సహకరించిన వారిలో కానిస్టేబుల్స్ రమణ, శివ, గణేష్, నవీన్, తిరుమలయ్య ఉన్నారు.

ఉర్దూ సెమినార్‌కు అమీర్‌బాబు లక్ష విరాళం



మంత్రి ఫరూక్‌కు లక్ష రూపాయల చెక్కును అందిస్తున్న అమీర్‌బాబు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంజుమన్ తరఖ్ఖీ ఉర్దూ ఆధ్వర్యంలో ఈ నెల 9న నిర్వహించనున్న జాతీయ ఉర్దూ సెమినార్‌కు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్ బాబు లక్షరూపాయలు విరాళం ప్రకటించారు. శనివారం రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు లక్ష రూపాయలు చెక్కు అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు ఉర్దూ మాధ్యమాన్ని పటిష్టపరచాలని కోరారు. ఈ సంస్థల్లోని అన్ని ఖాళీలు భర్తీ చేసి మైనార్టీ విద్యార్థులు నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. మంత్రి ఫరూక్ స్పందిస్తూ ఖాళీ ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర అంజుమన్ తరఖ్ఖీ అధ్యక్షుడు సత్తార్‌సాహిర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అష్రఫ్‌ఆలీఖాన్, నజీర్ అహ్మద్, జిలానీబాషా, సలావుద్దీన్, మగ్బుల్ అహ్మద్, సిరాజుద్దీన్ బుకారి తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ ఎంబీఏ పరీక్ష ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైవీయూ ఎంబీఏ హెచ్ఆర్ఎం నాలుగో సెమిస్టరు ఫలితాలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ క్రిష్ణారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసరు క్రిష్ణారావు ఎంబీఏ విభాగం డీన్ ప్రొఫెసరు సుబ్బరాయుడు విడుదల చేశారు. శనివారం వీసీ చాంబరులో ఫలితాలు విడుదల చేసిన ఆయన మాట్లాడుతూ ఎంబీఏ హెచ్ఆర్ఎంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. విద్యార్థులను అధ్యాపకులను వారు అభినందించారు.

ఎంటీఎంను అమలు చేయండి



ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

వేంపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మినిమిమ్ టైంస్కేల్ అమలుచేయాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని, దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అమలు చేయించాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి కి అధ్యాపకులు విజ్ఞప్తి చేశారు. శనివారం ట్రిపుల్‌ఐటీ అధ్యాపక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పులివెందులలో ఉన్న ఎమ్మెల్సీని కలిసి వినతిపత్రం అందించారు. నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో 400కు పైగా అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, శాశ్వత ప్రాతిపదికన భర్తీచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకునేలా దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

రాజంపేట టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వెంకటరాజం పేట గ్రామంలో శనివారం ఉదయం కారు ఢీకొని పెనగలూరు పెంచలయ్య(68) అక్కడికక్కడే మృతిచెందాడు. తిరుపతి నుంచి కడప వైపునకు వెళుతున్న కారు అదుపు తప్పి పెంచ లయ్యను ఢీకొంది. తలకు తీవ్ర గాయాలవడంతో మృతి చెందాడు. మన్నూరు సీఐ రామాంజనేయులు, పోలీసులు ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం

- మెప్మా పీడీ సురేశ్‌రెడ్డి

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టరు సురేశ్‌రెడ్డి అన్నారు. రెండురోజులపాటు నిర్వహించిన మెప్మా ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్ జిల్లాస్థాయి వర్క్‌షాపునకు శనివారం ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నిజమైన లబ్ధిదారులను గుర్తించడానికి వారి సామాజిక ఆర్థిక స్థితిగతులు వాస్తవిక సమాచారంతో కచ్చితమైన డేటాబేస్ అవసరమన్నారు. ప్రామాణికమైన డేటాను కలిగి ఉండడానికి ఎస్‌హెచ్‌జీ సభ్యుల జనాభా, ఆర్థిక వృత్తిపర వివరాలను కవర్ చేస్తూ డేటా ప్యూరిఫికేషన్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. దీనికోసం కోసం మెప్మా ఎండీ ఆధ్వర్యంలో ఒక ఆండ్రాయిడ్ అప్లికేషన్ అభివృద్ధి చేశారన్నారు. దీని ద్వారా రిసోర్స్ పర్సన్స్ (ఆర్‌పీలు) అన్ని గ్రూపుల్లోని సభ్యుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారని తెలిపారు. ఇందులో సీవోలు, సీఎంఎంలు, టీఈలు చివరగా పీడీ ఈ డేటాను ధ్రువీకరించి డిసెంబరు చివరి నాటికి డేటా మొత్తం ప్యూరిఫై చేస్తారన్నారు. జిల్లా స్థాయి వర్క్‌షాపులో కిందిస్థాయి సిబ్బందికి ఈ మొబైల్ యాప్‌లో ఎలా అప్‌లోడ్ చేయాలో శిక్షణ ఇచ్చారు.

జీవిత ఖైదీ పరార్

కడప (క్రైం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కడప సెంట్రల్ జైలు లో శిక్ష అనుభవిస్తున్న ఓ జీవిత ఖైదీ పరారయ్యాడు. దీంతో జైలు అధికారులు అతన్ని శనివారం అదుపులోకి తీసుకున్నారు. తమిళ నాడుకు చెందిన ఓ వ్యక్తి తిరుపతికి సంబంధించిన ఓకేసులో కడప సెంట్రల్ జైలులో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్నాడు. అత ను సత్ప్రవర్తనతో ఉండడంతో బేకరీలో పనిచేసేందుకు అధికారు లు అనుమతించారు. ఇదే అదనుగా భావించిన ఆ ఖైదీ రెండు రో జుల కిందట పరారయ్యాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గుట్టుచప్పుడు కాకుండా అధికారులు అతన్ని పట్టుకుని జైలుకు తరలించారు.

బెయిల్‌పై విడుదలైన ఖైదీ హల్‌చల్

నంద్యాలలో ఓ కానిస్టేబుల్ హత్య కేసులో కడప సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న వ్యక్తికి శనివారం బెయిల్ మంజూ రైంది. కాగా ఇతన్ని మరో కేసులో అరెస్టు చేసేందుకు నంద్యాల పోలీసులు అక్కడికి రావడంతో ఆ వ్యక్తి జైలు ఆవరణలోని నీళ్ల ట్యాంకు పైకి ఎక్కి హల్‌చల్ చేశాడు. దీంతో పోలీసులు, జైలు సిబ్బంది చాకచక్యంగా అతన్ని అదుపులోకి తీసుకుని నంద్యాలకు తరలించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో స్కార్పియో దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

చక్రాయపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి ఆలయం సమీపంలో శనివారం వైర్లు షార్ట్‌సర్క్యూట్‌తో ఒక స్కార్పియో దగ్ధమైంది. వివరాల్లోకెళితే.... బద్వేలు నియోజకవర్గం అట్లూరు మండలం పాతఅట్లూరు వాసి మన్నూరు నరసింహులు స్కార్పియో పూర్తిగా దగ్ధమైంది. సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య చొరవతో దేవస్థాన సిబ్బంది అలర్ట్ అయ్యారు. వేంపల్లె ఫైర్‌స్టేషన్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. నరసింహులు తన బంధువులతో శనివారం ఉదయం గండికి వచ్చి స్కార్పియోను అర్చకుల క్వార్టర్స్ వద్ద ఉంచి పాపాఘ్నిలో స్నానమాడి అంజన్న దర్శనానికి వెళ్లారు. అంతలో స్కార్పియోకు మంటలు అంటుకున్నారు. వాహనంలో రూ.25వేలు నగదు, పాస్ బుక్కులు, దగ్ధమైనట్లు బాధితుడు తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

కమలాపురం రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓ హత్య కేసులో తప్పించుకుని తిరుగుతున్న నిందితులను అరెస్టు చేశామని సీఐ రోషన్ తెలిపారు. ఆయన వివరాల మేరకు ఎస్పీ ఆదేశాల మేరకు కడప ఎస్‌డీపీఓ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో కమలాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రోషన్ కమలాపురం ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, వల్లూరు పోలీసు సిబ్బంది శనివారం మైదుకూరు టౌన్, ప్రొద్దుటూరు రోడ్డు నుంచి కడపకు వచ్చే బైపాస్‌లో మూలబాట వీధి సర్వీసు రోడ్డు వద్ద మధ్యాహ్నం హత్యకు పాల్పడి పరారీలో ఉన్న వ్యక్తులను పంచాయతీదారుల సమక్షంలో అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు వారు తెలిపారు.

ఎలక్ట్రీషియన్‌పై దాడి - కేసు నమోదు

పుల్లంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరాములపేటలో నివాసం ఉంటున్న ఎలక్ట్రీషియన్ రమణయ్యపై దళవాయిపల్లె వాసులు ఐదుగురు దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పిచ్చయ్య తెలిపారు. ఎలక్ట్రీషియన్ పనికి రావాలని పిలవగా డబ్బు సకాలంలో ఇవ్వరని అన్నందుకు ఇంటికి వచ్చి ఐదుగురు దాడి చేశారన్నారు.

పోలీసు సొసైటీపై విచారణ

కడప (క్రైం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పోలీసు వెల్ఫేర్ సొసైటీ డబ్బు వ్యత్యాసం ఉండడంతో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టినట్లు తెలిసింది. పోలీసు సిబ్బంది అవసరాల నిమిత్తం సొసైటీలో రుణం తీసుకుని తిరిగి చెల్లిస్తుంటారు. సొసైటీలో రూ.60 లక్షల మేర వ్యత్యాసం రావడంతో ఎస్పీ విచారణకు ఆదేశించారు.

అవినీతి ఆరోపణలపై కానిస్టేబుల్ సస్పెన్షన్

బద్వేలుటౌన్, నవంబరు2, (ఆంధ్రజ్యోతి): బద్వేలు అర్బన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ నాగసుబ్బయ్య సస్పెన్షన్‌కు గురయ్యారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నట్లు ఫిర్యాదులు రావ డంతో ఆ కానిస్టేబుల్‌ను సస్పెండ్‌చేసినట్లు సమాచారం.

వివాహిత ఆత్మహత్య

కడప క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కడపనగరం కాగితాలపెంటలో వివాహిత షేక్ ఫిర్‌దోస్ (40) ఉరి వేసుకున్నట్లు కడప తాలుకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సీఐ వివరాల మేరకు.. కాగితాల పెంటకు చెందిన షేక్ ఫిర్‌దోస్ కడప వాసి కరీముల్లాతో 17 ఏళ్ల కిందట వివాహం మైంది. కొన్ని నెలలుగా భర్త వేధింపులు తాళలేక తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతురాలి బంధువుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసి విచారిస్తున్నామని తెలిపారు.

నీళ్ల కోసం రోడ్డెక్కిన మహిళలు

- ఇరవై రోజులుగా నీటిని విడుదల చేయని అధికారులు
- బిందెలతో హరిజన మహిళల ఆందోళన



నీళ్ల కోసం బిందెలతో రోడ్డెక్కిన మహిళలు

పులివెందుల టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రిష్టియన్ లైన్‌లో నీళ్ల కోసం మహిళలు రోడ్డెక్కారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ సొంత ఊర్లో నీళ్ల కోసం మహిళలు బిందెలతో రోడ్డుపై నిరసన చేయడం చర్చనీయాంశంగా మారింది. శనివారం ఉదయం క్రిస్టియన్‌లైన్‌లో మహిళలందరూ బిందెలు తీసుకుని రోడ్డుపైకి వచ్చి మాకు నీళ్లు ఇప్పించే నాధుడే లేరా అంటూ నిరసన వ్యక్తం చేశారు. కేవలం దళితులమని, మాలలమనే మాకు నీటి సరఫరా చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని హరిజన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. హరిజనులకు నీళ్లు అవసరం ఉండవా అంటూ ప్రశ్నించారు. కనీసం బాత్‌రూం వెళ్లడానికి కూడా నీళ్లు లేవని అధికారులు దృష్టికి తీసుకువచ్చినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని 20 రోజులుగా చుక్క నీరు కూడా విడుదల చేయలేదని మేమే రూ.600 చెల్లించి ట్యాంకు నీల్లు తెప్పించుకోవాల్సి పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ఎన్నిరోజులు మేం డబ్బు చెల్లించి నీళ్లు తెచ్చుకోవాలా అని, మేం కూడా పన్నులు కడుతున్నామని మాకు మీరు ఎందుకు ఇవ్వరంటూ వారు వాపోయారు. కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్తే ఒక ట్యాంకు పంపించారని, ఒక ట్యాంకు నీళ్లు మూడు వీధులకు ఎలా సరిపోతాయన్నారు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు అధికారులు కానీ మా మొర విని మాకు తాగునీటి సమస్య లేకుండా చేయాలని వారు కోరారు.

రహదారులకు మహర్దశ

మదనపల్లె టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రహదారులకు మహర్దశ తీసుకొస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మదనపల్లె నియోజకవర్గంలోని అన్ని రోడ్లను గుంతలు లేని రోడ్లుగా తీర్చిదిద్దుతామని ఆయన వెల్లడించారు. శనివారం మండ లంలోని పుంగనూరురోడ్డు- బొమ్మనచెరువును కలిపే బండకాడపల్లె రోడ్డులో మిషన్ పాట్‌హోల్ ఫ్రీ ఏపీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్ల మరమ్మతులు చేపట్టకుండా గుంతల మయం చేసి రహదారులు నరకానికి మార్గాలుగా మార్చి వేసిందని దుయ్యబట్టారు. ఐదేళ్లలో కేవలం మరమ్మతులకు తక్కువ నిధులు ఖర్చుచేశారని, దీని వల్ల చిన్నచిన్న గుంతలు వర్షాకాలంలో పెద్దగొయ్యిలుగా మారిపోయాయన్నారు. ఈ రోజు సీఎం చంద్రబాబు మిషన్ పాట్‌హోల్ ఫ్రీ కార్యక్ర మాన్ని ప్రారభించారని ఇందులో భాగంగా బండ కాడపల్లె రోడ్డులో ఉన్న గుంతలు పూడ్చడానికి ఆర్‌అండ్‌బీ శాఖకు రూ.4.99లక్షలు మంజూరైందన్నారు. అలాగే నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, మున్సిపల్, జాతీయ రహదారులపై గుంతలు పూడ్చడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ అరవిందదేవి, కాంట్రాక్టర్లు, టీడీపీ నాయ కులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలోని రోడ్లకు మహర్ధశ రానుందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లె జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. 'మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఏపీ'(గుంతలు లేని రోడ్లు) కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కోటకొండ నుంచి కన్నెమడుగు మఠం వరకు సుమారు 7 కి.మీ. లింకు రోడ్డుకు మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ..గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు గుం తల రోడ్లలో ప్రయాణాలు సాగించలేక ప్రమాదాలకు గురై తీవ్రఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం నారా చంద్రబాబునాయుడు ఆలోచనల మేరకు 'మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఆంధ్రప్రదేష్' కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేపట్టి రోడ్ల రూపురేఖలు మారుస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయ కర్త మల్లికార్జున నాయుడు, మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసీధర్ నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి బేరిశీన, సోముశేఖర్, మాజీ ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు రెడ్డప్ప, రామచంద్ర, గురుమూర్తి, మదన, కాలా నారాయ ణ, రేపన బాబు, ఆదిరెడ్డి, బావాజాన్(ఎన్‌ఆర్‌ఐ), క్రిష్ణారెడ్డి, రాజేష్, జయరాంరెడ్డి, జగదీష్, అశోక్, నరేంద్ర పాల్గొన్నారు.



మదనపల్లెలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


తంబళ్లపల్లెలో రోడ్లకు మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న టీడీపీ నేత దాసరిపల్లె జయచంద్రారెడ్డి

ప్రభుత్వం మారినా.. అధికారులు మారరా..?


బూచిపల్లెలో ప్రజాపంపిణీ బియ్యం వాహనానికి దర్శనం ఇస్తున్న జగన్ ఫొటో



సంపతికోట సచివాలయం వెల్‌నెస్ సెంటర్‌కు తొలగని వైయస్.ఆర్ పేరు

పెద్దతిప్పసముద్రం నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం మారి నెలలు గడుస్తున్నా... పంచాయతీ అధికారుల తీరుమాత్రం మారడం లేదు..గత ప్రభుత్వ హయాంలో ఆయా గ్రామాల్లోని కేంద్ర ప్రభుత్వ నిధులతో సచివాలయాల్లో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్లు ఆయుష్మాన్ భారత్ పేరుతో నిర్మించి ఆ సెంటర్లకు వైయస్‌ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ పేరుతో సెంటర్లను అప్పటి ప్రభుత్వంలో నిర్మించారు. కాగా ఆ సెంటర్లు ప్రారంభానికి నోచుకోలేదు. పంచాయతీ అధికారులు, అప్పటి వైసీపీ నాయకులు పెద్దగా హంగామా చేస్తూ అంతా తామే చేసినట్లు వైసీపీ పేరుతో నానా హంగామా చేశారు. కాగా తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా..పంచాయతీ అధికారులు వైసీపీ రంగులు కానీ, వైయస్ ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ పేరును గానీ ఇంత వరకు తొలగించుకుండా ఉండడంపై పలువురు ఇదేమి చోద్యమంటూ పలువురు పెదవివిరుస్తున్నారు. అయితే ప్రభుత్వం మారి నెలలు గడుస్తున్నా అధికారులు అప్పటి తీరునే కొనసాగిస్తుండడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెద్దతిప్పసముద్రం మండలంలోని పలు సచివాలయాల్లో ఇప్పటికి వైయస్ ఆర్ పేరే కనిపిస్తున్నా అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అదే విధంగా మండలంలోని బూచిపల్లె గ్రామ పరిధిలో ఇంటింటికి బియ్యం పంపిణీ చేసే వాహనానికి కూటమి ప్రభుత్వం మారి నెలలు గడుస్తున్నా కూడా నేటికి జగన్ బొమ్మ కనిపిస్తుండడం అధికారుల తీరుకు అద్దం పడుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. కనీసం ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు, సచివాలయ ఉద్యోగులు వాటిపై దృష్టి సారించి ఆ పేర్లు, బొమ్మలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

వంతెన రాదు.. కష్టాలు తీరవు..!


గత వర్షాలకు కుషావతినది ఉధృతి ప్రవాహం దాటుతున్న విద్యార్థుల కష్టాలు

పెద్దమండ్యం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం సమీపంలో కుషావతినదిపై బ్రిడ్జి నిర్మాణం కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్ల క్రితం పెద్దమండ్యం- గుర్రంకొండ రహదారి డబుల్ తారురోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా పెద్దమండ్యం కుషావతినదిపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అప్పటి అధికారులు నిర్లక్ష్య వైఖరికి నిధులు వెనక్కి వెళ్లాయి. దశాబ్దాలుగా ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు గ్రామ సభల్లో, మండల సర్వసభ్య సమావేశాల్లో వందల సార్లు విన్నవించి వినతి పత్రాలు ఇచ్చినా? స్థానికులు పలు మార్లు నిరసనలు తెలిపినా? బ్రిడ్జి మాత్రం రాలేదు. వర్షకాలంలో ఈ నది ఉధృతికి ప్రయాణికులు కష్టాలు చవిచూడాల్సిందే. ఆ సమయంలో మండల అధికారులు అక్కడికి చేరుకొని ప్రమాద బోర్డులు ఏర్పాటు చేస్తారు. వర్షాలు తగ్గుముఖం పట్టగానే ఆ సమస్యను కూడా వదలివేయడం ఆనావాయితిగా మారిపోతోంది. పెద్దమండ్యం ప్రజలకు ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం అందని ద్రాక్ష పండులాగా మారింది. వర్షకాలం వస్తే పెద్దమండ్యం, సి.గొల్లపల్లి, గాలివీడు, మదనపల్లి ప్రాంత ప్రజలు వర్షం కురిస్తే కుషావతినది నీటి ఉధృతికి ప్రయాణాలు, పాఠశాలలు, అత్యవసర సేవలను నిలిపివేయాల్సిందే.. అత్యవసర వేళల్లో ఈ నది ప్రవాహంలో జీపును దాటిస్తూ కలిచెర్లకు చెందిన ఓ వ్యక్తి నీటి ఉధృతికి కొట్టుకు పోయి ప్రాణాలు కోల్పోయారు. ఇక్కడ ఎందరో రోడ్డు ప్రమాదాలకు గురయ్యారు. ప్రతి వర్షకాలం లో ఈ మార్గంలో వాహనదారులు, ప్రయాణికులు, స్థానికులు పలు కష్టాలు పడుతున్నా ప్రజాప్రతినిధులు తెలిసిన తెలియనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైన కూటమి ప్రభుత్వం, జిల్లా అధికారులు చర్యలు తీసుకొని కుషావతిపై త్వరలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరారు.

పంట బీమా ప్రీమియం చెల్లించాలి

లక్కిరెడ్డిపల్లె నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రైతులు పంట బీమా ప్రీమియంను తప్పనిసరిగా చెల్లించాలని జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు మజీద అహ్మద్ సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీవో సభా భవనంలో డివిజన్ పరిధిలోని రామాపురం, లక్కిరెడ్డిపల్లె, వీరబల్లి, గాలివీడు మండలాలకు చెందిన రైతు సేవా కేంద్రం సిబ్బంది, వ్యవసాయ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్ తోపాటు, 2025-26 ఖరీఫ్, రబీ సీజన్లల్లో పంటలు సాగుచేసే రైతులు తప్పకుండా పంటబీమా కోసం ప్రీమియం చెల్లించాలన్నారు. పంటరుణం పొందిన రైతులు బ్యాంక్ రుణం నుంచి ప్రీమియం చెల్లించవచ్చన్నారు. రుణం తీసుకోని రైతులు మీ సేవ, లేదా గ్రామ సచివాలయం ద్వారా చెల్లించవచ్చన్నారు. ప్రస్తుత రబీ సీజన్‌కు వరి, వేరుశనగ, టమోటా పైర్లకు బీమా వర్తిస్తుందన్నారు. కృషి విజ్ఞాన కేంద్ర అధికారి మానస మాట్లాడుతూ నవంబరు, డిసెంబరు మాసాల్లో మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు పొందవచ్చున్నారు. లక్కిరెడ్డిపల్లె ఏడీఏ జయరాణి, మండల వ్యవసాయ అధికారులు రమేష్‌బాబురావు, నాగమణి, స్వాతి, వ్యవసాయ సహాయకులు వీరబల్లి నాగరాజు, రైతు సేవాకేంద్ర సిబ్బంది పాల్గొన్నారు

మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచండి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచాలని మండల విద్యాశాఖ అధికారులు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్య సూచించారు. శనివారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌ను సందర్శించి అపార్ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివ శంకర్‌రెడ్డి, అధ్యాపకులు , ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు

17 గ్రామాల్లో రిజిస్ట్రేషన్ సేవలు పునరుద్ధరణ

తంబళ్లపల్లె, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధి లోని తంబళ్లపల్లె, పెద్దమండ్యం, ములకలచెరువు, పీటీయం మండలాల్లోని 17 గ్రామాల్లో వ్యవసాయ భూములకు సంబంధించి నిలిచిన రిజిస్ట్రేషన్ సేవలు తిరిగి పునరుద్ధరించినట్లు సబ్‌రిజిస్ట్రార్ ఉదయ్‌కిరణ్‌రెడ్డి తెలిపారు. గతంలో రీ సర్వే పూర్తైన 4 మండలాల్లోని 17 గ్రామాల్లో పలు సాంకేతిక కారణాల వలన వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోయాయి. దీంతో ఈ గ్రామాల్లో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి భూముల అమ్మకాలు, కొనుగోళ్లు జరగక పలువురు రైతులు, ప్రజలు ఇబ్బంది ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసులు, తంబళ్లపల్లె సబ్ రిజిస్టర్ ఉదయ్ కిరణ్‌రెడ్డిలు రాష్ట్ర స్థాయి రిజిస్ట్రేషన్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వారు సమస్యను పరిష్కరించడంతో నిలిచిన రిజిస్ట్రేషన్ సేవలు తిరిగి అందుబాటులోకి వచ్చాయి. దీంతో తంబళ్లపల్లె మండలంలోని పంచాలమర్రి, ఎర్రసానిపల్లె, కన్నెమడుగు, కోటకొండ, రేణుమాకులపల్లె, కుక్కరాజుపల్లె, మర్రిమాకులపల్లె, గంగిరెడ్డిపల్లె, కొట్లపల్లె, జుంజురపెంట, పెద్దమండ్యం మండలంలోని సిద్దవరం, శివపురం, ములకల చెరువు మండలంలోని చెన్నప్పగారిపల్లె, నాయనిచెరువుపల్లె, ములకలచెరువు, పీటీయం మండలంలోని జగడం వారిపల్లె, పులికల్లు గ్రామాల్లో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ సేవలు పునరుద్ధరించినట్లు తెలిపారు. ఈ పంచాయతీల్లోని భూ అమ్మకందార్లు, కొనుగోలుదార్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సోషియల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోండి


టూటౌన్ ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న జనసేన ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం

మదనపల్లె అర్బన్, నవంబరు2:(ఆంధ్రజ్యోతి) ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుమార్తెలపై సోషియల్ మీడియాలో అసభ్య పదజాలంతో పోస్టు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం కోరారు. ఆమేరకు శనివారం మదనపల్లె టూటౌన్‌లో పోలీసులకు అయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు ఉత్పన్నం కాకుండా అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు ఇలాంటి ఆకతాయిల ఆటలు కట్టించాలని కోరారు.

వ్యక్తి నుంచి ప్రాణహాని ఉంది

- ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు

మదనపల్లె అర్బన్, నవంబరు2(ఆంధ్రజ్యోతి):ఓ వ్యక్తి నుంచి తనకు ప్రాణహాని ఉందని మదనపల్లె టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఓ మహిళ పోలీసులను ఆశ్రయించింది. పోలీసుల కథనం మేరకు మదనపల్లె పట్టణం, బీకేపల్లెలో నివాసం ఉన్న భార్గవి(30) గత కొంత కాలంగా మొదటి భర్తతో విడిపోయి ఒంటరిగా ఉండేది. కొద్దిరోజులు తరువాత ములకలచెరువుకు చెందిన రవీంద్రనాయక్‌తో పరిచయం ఏర్పడి భార్గవి అతనితో సహజీవనం చేసేది. దీంతో బిడ్డలకు జన్మనిచింది. ఇప్పుడు పెళ్లి చేసుకోమంటే రవీంద్రనాయక్ చంపుతామని బెదిరిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

దాడి ఘటనపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, నవంబరు 2:(ఆంధ్రజ్యోతి) ఇరు వర్గాలు దాడి చేసుకున్న కేసులో పవన్, అతని స్నేహితులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. శుక్రవారం రాత్రి మదనపల్లె పట్టణం దేవతానగర్‌లో నివాసం ఉంటూ టాక్సీ డ్రైవర్ పఠాన్ మహమ్మద్ బాషా తన కారును పార్క్ చేసే సమయంలో అక్కడే ఉన్న పవన్, అతని స్నేహితులు కొట్టి గాయపర్చారు. విషయం తెలుసుకున్న అతని కుమారుడు, కుమార్తెతోపాటు బంధువులు సంఘటన స్థలం చేరుకుని వారి ప్రశ్నించడంతో మళ్లీ గొడవ పడ్డారు. వారు చికిత్స కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చేరారు. శనివారం మహమ్మద్‌బాషా కుమార్తె సబిహా ఫిర్యాదు మేరకు పవన్. అతని స్నేహితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి

రామాపురం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): కరువుతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మండల ఉపాధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి కోరారు. మండల పరి షత్ సభాభవనంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వాణిజ్య పంటలు సాగు చేసే అవకాశం లేకపోవడంతో మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో ఉలవ పైరు సాగు చేసుకున్నారన్నారు ఎంపీడీవో జాషువా, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అన్నిశాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

కలకడ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒకరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు పని చేయాలని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాల యంలో గ్రామాల వారీగా సమీక్షా సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, సీసీ రోడ్లు, విద్యుత్, రెవెన్యూ సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. అలాగే ఉపాధి హామీ పనులను వేగవంతం చేయా లన్నారు. నాయకులు, అధికారుల సమన్వ యంతో పల్లెల అభివృద్ధి సాధించుకోవా లన్నారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజల నుంచి ఎమ్మెల్యే అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు మల్లారపు రవిప్రకాశ్‌నాయుడు, మద్దిపట్ల సూర్యప్రకాశ్, ప్రభాకర్‌నాయుడు, వంగిమల్ల మదుసూదన్‌రెడ్డి, మద్దిపట్ల వెంకటరమణనాయుడు, తిరుపతినాయుడు, కాంతారావు, కోనేని ఆనందర్‌కుమార్‌నాయుడు, మల్లికార్జున్‌నాయుడు, కోనేని వసంత నాయుడు, జనార్ధన్‌నాయుడు, పివినాయుడు, కోట రమణ, ప్రసాద్‌నాయుడు, రైస్‌మిల్ రమణ, తారకేశ్వర్, భరత్‌రాజు, తహశీల్దార్ ఫణికుమార్, ఎంపీడీవో అబ్దుల్ రహీం, అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా


సభ్యత్వ నమోదు చేయిస్తున్న టీడీపీ నేత త్యాగరాజు

ములకలచెరువు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తల కుటుంబాలకు భరోసా కలుగుతుందని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ పేర్కొన్నారు. మండలంలోని ములకలచెరువు, దేవళచెరువు పంచాయతీల్లో శనివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్దపీట వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, నాయకులు గంగాదేవి, భజంత్రి రామాంజులు, రాము, జయరాం, శ్రీనివాసులు, రాందాసు, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


డీఈవోను సన్మానిస్తున్న ఎన్‌టీఏ, ఏపీసీపీఎస్‌ఈఏ నాయకులు

పీలేరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉపాధ్యాయులు, విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని ఎన్‌టీఏ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రెడ్డి రమేష్, ఏపీ సీపీఎస్‌ఈఏ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ పేర్కొన్నారు. అన్నమయ్య నూతన జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు చేపట్టిన సుబ్రహ్మణ్యంను శనివారం నోబుల్ టీచర్స్ అసోసియేన్(ఎన్‌టీఏ), ఏపీసీపీఎస్‌ఈఏ నాయకులు ఘనంగా సన్మానించారు. రాయచోటిలోని విద్యాశాఖ కార్యాలయంలో డీఈవోను కలిసిన జిల్లాలో విద్యా ప్రమాణాలు, ఫలితాలు పెంచేందుకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉన్నారని, ఉన్నతాధికారుల తోడ్పాటు లభిస్తే మంచి ఫలితాలు సాధిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు రాజు, జయప్రకాశ్ నాయుడు, సురేశ్ కుమార్, వేణు, సుబ్రహ్మణ్యం, భాస్కరరెడ్డి, పోతంశెట్టి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే బీసీలకు సముచిత స్థానం


వైద్యం శాంతారామ్‌ను మర్యాదపూర్వకంగా కలసిన టీడీపీ నాయీబ్రాహ్మణ సమితి సభ్యులు

మదనపల్లె టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ పాలనలోనే బీసీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానాలు దక్కాయని టీడీపీ రాష్ట్ర నాయీబ్రాహ్మణ సాధికార సమితి సభ్యుడు ఎం.ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం కుప్పంలో టీటీడీ బోర్డు సభ్యుడుగా నియమితులైన వైద్యం శాంతారామ్‌ను మదనపల్లె నాయీబ్రాహ్మణులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగానే టీటీడీ బోర్డులో నాయీబ్రాహ్మణుడికి చోటు కల్పించారన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి బలోపేతం కోసం కృషి చేసిన వైద్యం శాంతారామ్‌కు టీటీడీ బోర్డు సభ్యత్వం ఇవ్వడమే ఇందుకు తార్కాణమన్నారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణుల సాధికార సమితి సభ్యులు మనోహర్, పాండు, సుబ్రమణ్యం, చెన్నకేశవ, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

శకుంతలమ్మ సేవలు చిరస్మరణీయం


: విద్యార్థులకు అన్నదానం నిర్వహిస్తున్న దాత కుటుంబీకులు

వాల్మీకిపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రిటైర్డు ప్రధానోపాధ్యాయురాలు శకుంతలమ్మ సేవలు చిరస్మరణీయమని వాల్మీకిపురం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఆవరణలో శకుంతలమ్మ సంస్మరణ సభను నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయురాలుగా, హెచ్‌ఎంగా ఆమె ఎన్నో సేవలు అందించారని, స్థానిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తూ ఎంతో మంది నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేశారని కొనియాడారు. శకుంతలమ్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినంద నీయమన్నారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులకు దాత కుటుంబ సభ్యులు భోజనాలు వడ్డించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్.. నగదు స్వాధీనం

నిమ్మనపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న 8మందిని పట్టుకొని వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రెడ్డివారిపల్లి పంచాయతి పిట్టావాండ్లపల్లి సమీపంలోని వడ్డిపల్లి వద్ద పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలసి దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడులలో 8మంది పేకాటరాయుళ్లను అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి రూ.4వేలు నగదును స్వాధీనం చేసుకొని రిమాండుకు తలించినట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవరచుకోవాలి



ఎమ్మెల్యే కిశోర్, హేమచంద్రారెడ్డిని సన్మానిస్తున్న వైద్యులు

పీలేరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించిన ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవరచుకుని తమ స్వగ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పీలేరు మండలం ముడుపులవేముల గ్రామానికి చెందిన జీవ పారిశ్రామికవేత్త డాక్టర్ హేమచంద్రారెడ్డి శనివారం గ్రామంలో తిరుపతి రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వంత ప్రాంత ప్రజల ఆరోగ్యం కోసం తన స్వంత నిధులతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన హేమచంద్రారెడ్డిని ఆదర్శంగా తీసుకుని మరి కొంత మంది ముందుకు వచ్చి గ్రామాలలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం రమాదేవి ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్యే, హేమచంద్రారెడ్డిని ఘనంగా సన్మానించారు. శనివారం జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ముడుపులవేముల పంచాయతీలోని గ్రామాలతోపాటు చుట్టుపక్కల ఉన్న కావలిపల్లె, ఒంటిల్లు గ్రామాల నుంచి 420 మంది వైద్య సేవలు పొందారు. ఎనిమిది మంది వైద్యులు, ప్రజలకు జనరల్, డెంటల్, గైనిక్, సైక్రియాటిక్ సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజర్ మనోహర్, స్థానిక టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

20న సాగునీటి సంఘాల ఎన్నికలు

సుండుపల్లె, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల అభివృద్ధిలో సాగునీటి సంఘాల పాత్ర ఎంతో కీలకమని ఏఈఈ నాగేంద్ర నాయక్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దైవాధీనంతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 20న మండలంలోని యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి పించా ప్రాజెక్టు, మడితాడు గ్రామ పంచాయతీలోని కృష్ణారెడ్డిచెరువు, సుండుపల్లెలోని గునేటివాగు, తిమ్మసముద్రంలోని ఊటచెరువు, జీ. రెడ్డివారిపల్లెలోని నారాయణరెడ్డి చెరువులకు నీటి సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.